TS-11-0036701

నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక

మంచిమాట

మంచిమాట దానం లాంటిది,
ప్రతిఫలంగా పుణ్యాన్ని అందిస్తుంది.
చెడ్డమాట అప్పులాంటిది, ప్రతిగా
వడ్డీ చెల్లించాల్సి వస్తుంది.

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

నేటి చర్చ జాతీయ తెలుగు దిన పత్రిక

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 62 శనివారం, అక్టోబర్ 31, 2026 , పేజీలు - 12 వెల : 2/-

ప్రజల జీవితాల్లో మార్పే
వాస్తవ అభివృద్ధి

● 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం ● ఉపాధి, విద్య, వైద్యం, జీవన భద్రతకు ప్రాధాన్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్,అక్టోబర్ 30 : ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన అభివృద్ధి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఆర్థిక వృద్ధి కేవలం గణాంకాలకే పరిమితం కాకు ండా ప్రతి కుటుంబానికి

మిగతా2లో...

జోహార్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రభుత్వం
తొలగించాల్సిందే
బిజెపి నేత మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్

నేటి చర్చ : జవహర్ నగర్, హైదరాబాద్,30 అక్టోబర్ 2026, బిజెపి నేత మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ 27న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపు కొరకు చేపట్టిన మహా పాదయాత్ర నేటికీ నాల్గవ రోజు జవహర్ నగర్ లో భారీ బహిరంగ సభతో ముగిసింది. భారీ వర్షంలో సైతం ప్రజలు, కార్యకర్తలు,అభిమానులు కుర్చీలను తలపై పెట్టుకుని మీటింగ్ లో పాల్గొంటున్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో తొలగించాలని లేనియెడల ఈ పోరాటం ఇలానే ఉధృతంగా చేస్తామని ఈటెల రాజేందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడవద్దని డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే చెడు వాసన వల్ల ప్రజలు అనారోగ్యం పాలై మరణించడం జరుగుతుంది, ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడ వద్దని వెంటనే డంపింగ్ యార్డ్ ను తొలగించాలని వ్యర్థ పదార్థాలను రీసైకిల్ చేసి ఇంకోచోట ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని



హెచ్చరించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీ లు రఘునందన్ రావు, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, ధన్పాల్ ఆయన గుప్తా తదితరులు పాల్గొని, ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డ్ ను ప్రభుత్వం తొలగించాలని లేనిచో భారతీయ జనతా పార్టీ తరఫున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వ్యాఖ్యానించారు.





జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా
జనగణన!

ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ

ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాలకు తాత్కాలిక మినహాయింపు



న్యూఢిల్లీ,అక్టోబర్ 30 : దేశవ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అక్టోబర్ 30న అధికారిక ప్రకటన జారీ చేసింది. ఎన్నికలు జరగనున్న

మిగతా2లో...

పోలింగ్ కేంద్రాల వద్ద
భద్రత కట్టుదిట్టం!

- ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలి
- ఫిర్యాదులపై తక్షణ స్పందన.. నిష్పక్షపాత విచారణకు ఆదేశాలు



అమరావతి,అక్టోబర్ 30 : తీర ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల పరిశీలకులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి శుక్రవారం సీడీఎంఏ సంపత్‌కుమార్, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, డీఐజీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మిగతా2లో...



మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్సే

● సుప్రీంకోర్టులో ఎనిమిదేళ్ల పాటు న్యాయపోరాటం చేశాం ● భూములను విక్రయించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకించిన హరీశ్‌రావు


హైదరాబాద్,అక్టోబర్ 30 : మియా పూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే సుప్రీంకోర్టులో

మిగతా2లో...

హైస్పీడ్ రైలు మార్గాల పనులు
వేగవంతం చేయండి!

● తెలంగాణకు ప్రకటించిన మూడు కారిడార్లకు త్వరగా అనుమతులు ఇవ్వాలి
● కొత్త రైల్వే మార్గాల మంజూరుకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
● అనంతారంలో మెగా ఫ్లైట్ నిర్వహణ డిపో ఏర్పాటు చేయండి





సింగరేణి కార్మికులకు
దీపావళి కానుక!

ఒక్కో కార్మికుడికి గరిష్టంగా
రూ.1,10,250 బోనస్
నవంబర్ 5న బ్యాంకు
ఖాతాల్లో జమ.. భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్ 30 : సింగరేణి కార్మికు లకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. నవం బర్ 5న కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఒక్కో అర్హత కలిగిన కార్మికుడికి గరిష్టంగా రూ. 1,10,250 చొప్పున మొత్తం 38 వేల మందికి రూ.419 కోట్లు చెల్లించనున్నారు.ఇప్పటికే దసరా లాభాల వాటా కింద రూ.600 కోట్లు చెల్లించగా,

మిగతా2లో...

ప్రజల కోసమే కొత్త రాజకీయ
శక్తిగా వచ్చాం


● రైతులు, యువత, ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం ● పంటలు వేయొద్దన్న సీఎం అధికారంలో ఉండొద్దు ● ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ఇంద్రవెల్లి,అక్టోబర్ 30 : ప్రజలకు మేలు చేసేందుకే కొత్త రాజకీయ శక్తిగా ముందుకు వచ్చామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఆదివాసీల అభివృద్ధి, విద్య, వైద్యం, సాగునీటి సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.జిల్లాలోని 750 గ్రామాలకు కనీసం పాఠశాలలు కూడా

మిగతా2లో...

రైతాంగ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల ఏర్పాటు
రూ.2 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం
రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

2లో

హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి!

న్యూఢిల్లీ,అక్టోబర్ 30 : తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైలు మార్గాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. హైదరా బాద్ పుణె, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్లకు సంబంధించి కేంద్రం పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ తిరిగి పంపినట్లు తెలిపారు. కేంద్రం త్వరగా మార్గాల అమరికను ఖరారు చేస్తే భూసేకరణ ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో సీఎం సమావేశమై తెలంగాణకు అవసరమైన కీలక రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. వికారాబాద్‌కృష్ణా మధ్య 130 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నందున ఆ ప్రాంతాన్ని సిమెంట్, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న సుమారు 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డు పక్కనే ప్రాంతీయ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేలా మార్గాన్ని ఖరారు చేయాలని సీఎం కోరారు. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు.డోర్నకల్‌గద్వాల, కల్వకుర్తి మాచర్ల, కాచిగూడజగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరుఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్‌లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ (8 కి.మీ.) రైల్వే మార్గాలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించిన మెగా కోచింగ్, సరుకు రవాణా నిర్వహణ డిపోను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిపో కోసం అవసరమైన 409 ఎకరాల ఒక గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని తెలిపారు. ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ భూములను విక్రయిస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఈ భూముల విక్రయం, వాటి ద్వారా వచ్చే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించినట్లు వివరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు వాటిని ప్రజా ప్రయోజనాలకు వినియోగించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.మియాపూర్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విలువైన భూములను ఆక్రమించేందుకు గత బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని సీఎం ఆరోపించారు. మియాపూర్ భూముల వ్యవహారంలో కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్ పేర్లను ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే భూ ఆక్రమణలపై పోరాటం చేశానని తెలిపారు.
కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ, మంచిరేవుల ప్రాంతాల్లోని భూముల పరిరక్షణకు న్యాయపోరాటం చేసినట్లు వివరించారు. గుర్రంగూడలోని భూములు అటవీ భూములేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కూడా పరిరక్షించినట్లు తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోనూ ప్రభుత్వ, అటవీ భూముల పరిరక్షణ కోసం న్యాయపోరాటం చేసినట్లు సీఎం పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ భూముల వ్యవహారాలపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఈ అంశాలపై శాసనసభలో చర్చించేందుకు బీఆర్ఎస్ నాయకులు ముందుకు రావాలని సవాల్ విసిరారు. మియాపూర్ భూముల విషయంలో ఇకనైనా వివాదాలు సృష్టించకుండా, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని కేటీఆర్, హరీశ్‌రావులకు సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

ప్రజల కోసమే కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

లేవని, ఆదిలాబాద్ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేపీ రావు, జగన్నాథ ప్రాజెక్టులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. రైతులకు నీరు, విద్యుత్, యూరియా అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పంటలు వేయొద్దని సూచిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలో ఎందుకు కొనసాగాలని ప్రశ్నించారు.తమ పార్టీ పంచజన్య పేరుతో ఐదు ప్రధాన అంశాలను లక్ష్యంగా పెట్టుకుందని కవిత తెలిపారు. ప్రైవేటు రంగంలోనూ మెరుగైన ఉచిత విద్య, వైద్యం అందించేందుకు కృషి చేస్తామని, యువతకు రుణాలు కల్పించి ఆర్థికంగా ఎదిగేలా తోడ్పడతామని హామీ ఇచ్చారు. రైతులకు సాగునీరు, విద్యుత్, ఎరువులు అందించి వారి గౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమన్నారు. ఆదిలాబాద్‌లో రైతు గర్జన సభ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ముందుగా గతంలో తాము చేసిన పనులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సభకు ముందు ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద కుమురం భీం, కుమురం సూరు, రాంజీ గోండు, వన్నెల ఎల్లన్న, వెడ్మ రాములకు నివాళు లర్పించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపూరావు, మాజీ మంత్రి బోడ జనార్ధన్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతాంగ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల ఏర్పాటు

రూ.2 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్,అక్టోబర్ 30 : వ్యవసాయ రంగానికి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని శు క్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర



సత్యనారాయణరావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పలు ప్రతిపాదనలు చేశారని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నా యని, ఇతర ప్రాంతాల నుంచి విద్యుత్ తీసుకొస్తున్నామని వివరించారు.ప్రజలకు తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటలు సాగు చేయాలని, రబీ పంటల సాగుపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సర్పంచ్ బండి భగవాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు పారదర్శకంగా జరగాలి

తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే చట్టపరమైన చర్యలు

అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్,అక్టోబర్ 30 : పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పట్టభద్రుల ఓటర్ల



నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ఎలా జరుగుతోందో, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎదుర్కొంటున్న సమస్యలేమిటో అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని, అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖా స్తుదారులు సమర్పించిన ఫారం-18, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటరుగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, అల్వాల్ తహశీల్దార్ రాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరప్రదేశ్, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ప్రస్తుతం జనగణన నుంచి మినహాయింపు ఇచ్చింది. లడఖ్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాల్లోనూ ఈ షెడ్యూల్ వర్తించదు.జనగణనలో భాగంగా 2027 జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకునే అవకాశం కల్పించనున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలను సేకరిస్తారు. మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలను జనగణన ప్రామాణిక తేదీగా నిర్ణయించారు. మినహాయింపు పొందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు సంబంధించిన తేదీలను తరువాత ప్రకటించనున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం, పక్షపాతం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించాలని పునేఠా స్పష్టం చేశారు.ఎన్నికల ప్రారంభ దశలో ఏడు జిల్లాల నుంచి అందిన ఫిర్యాదులను డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓటర్ల సంఖ్య, భద్రతా ఏర్పాట్లు, కేంద్రం వివరాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మల్లికార్జున సూచించారు.ఒక్క బ్యాలెట్ పేపర్ కూడా గల్లంతు కాకుండా పటిష్ఠ భద్రత కల్పించాలని, స్ట్రాంగ్‌రూమ్‌లకు సుమారు 100 మీటర్ల దూరంలో ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా ఎవరూ పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. ఓటింగ్ గోప్యతకు భంగం కలగకుండా మీడియా ప్రతినిధులు వ్యవహరించాలని సూచించారు.సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి కదలికను రికార్డు చేయాలని ఐజీ బి.రాజకుమారి ఆదేశించారు. పోలీసు సిబ్బంది సైతం ప్రిసైడింగ్ అధికారి అనుమతితోనే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని, కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో గుంపులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సింగరేణి కార్మికులకు దీపావళి కానుక!

(మొదటి పేజీ తరువాయి)

తాజా బోనస్‌తో కలిపి ఒకే నెలలో కార్మికులకు అందుతున్న మొత్తం రూ.1,020 కోట్లకు చేరనుంది. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి నవంబర్ 5న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ బోనస్ జాతీయ వేతన ఒప్పందం (ఎన్‌సీడబ్ల్యూఏ) పరిధిలోని కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 30 రోజులు పనిచేసిన వారు అర్హులు. నిర్ణీత పనిదినాలు పూర్తి చేసిన వారికి పూర్తి బోనస్, అంతకంటే తక్కువ రోజులు పనిచేసిన వారికి పని చేసిన కాలానికి అనుగుణంగా బోనస్ చెల్లించనున్నారు.

ప్రజల జీవితాల్లో మార్పే వాస్తవ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన ఉపాధి, విద్య, వైద్యం, జీవన భద్రత కల్పించాలని స్పష్టం చేశారు.డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ సంస్థ 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా అమలు చేయడంలో అధికారులకు శిక్షణనిచ్చే సంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలు, పనితీరు మెరుగుపడినప్పుడే ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని అన్నారు. హైదరాబాద్‌లో సాంకేతిక పరిజ్ఞానం, జీవశాస్త్ర పరిశో ధనలు, ఆధునిక సేవారంగాలు సాధించిన ప్రగతి రాష్ట్రానికి గొప్ప అవకాశమని భట్టి తెలిపారు. ఈ అభివృద్ధి నగరానికే పరిమితం కాకుండా తయారీ, వ్యవసాయ, గ్రామీణ ఆర్థిక రంగాలకు విస్తరించాలని ఆకాంక్షించారు. యువత ఉపాధి కోసం హైదరాబాద్‌కు మాత్రమే వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత జిల్లాల్లోనే మెరుగైన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్సే

(మొదటి పేజీ తరువాయి)

న్యాయపోరాటం చేసిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. 2015లో సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్‌ను నియమించి ప్రభుత్వానికి అనుకూలంగా వాదనలు వినిపించేలా చేశామని పేర్కొన్నారు.2015 నుంచి 2023 వరకు దాదాపు ఎనిమిదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేసును నిరంతరం కొనసాగించిందని హరీశ్‌రావు వివరించారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లు, అఫిడవిట్లు, ఆధారాల సమర్పణలో తమ ప్రభుత్వ పాత్ర కీలకమని చెప్పారు. 2023 జూన్ 15న ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసులో వచ్చిన తీర్పు కూడా మియాపూర్ భూముల కేసుకు బలమైన న్యాయపునాది వేసిందన్నారు.సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని హరీశ్‌రావు విమర్శించారు. గత ప్రభుత్వ కృషికి ప్రస్తుత ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని ఆరోపించారు. సుమారు రూ.60 వేల కోట్ల విలువైన 550 ఎకరాల భూములను విక్రయించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనను ఆయన వ్యతిరేకించారు. ప్రజా ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీలకు ఐదేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక

● గ్రామాల వారీగా వివరాల సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు

హైదరాబాద్,అక్టోబర్ 30 : రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ఐదేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుత ఏడాదికి ప్రత్యేక కార్యాచరణతో పాటు రానున్న మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.గ్రామాల వారీగా జనాభా, పశు వులు, పంటలు, నిరుద్యోగులు, పేద కుటుంబాల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. అందుబాటులో ఉన్న నిధులను సమీకరించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తప్పుడు సమాచారం ఇచ్చినా, వివరాల నమోదు నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

జిల్లా స్థాయి క్రీడా సెలక్షన్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే



చర్చ, జగిత్యాల: జగిత్యాల పట్టణంలోని ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎం శ్రీ జగిత్యాల జిల్లా స్థాయి టోర్నమెంట్ సెలక్షన్స్‌ను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. బాలబాలికల విభాగాల్లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో డీఈఓ రాము, కౌన్సిలర్లు చీటి లక్ష్మీనారాయణ, కూతురు రాజేష్, పిట్ట ధర్మరాజు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి చక్రధర్ రావు, నోడల్ అధికారి శ్రీనివాస్, వేణు భాస్కర్, నాయకులు ములసపు మహేష్, సర్పంచులు అరుణ, శేఖర్, రాజు, రమేష్ తదితరులున్నారు.

క్రీడలతోనే విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం

జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



చర్చ, జగిత్యాల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.శుక్రవారం జగిత్యాల పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్, సెలక్షన్స్ 2026--27లో భాగంగా నిర్వహించిన పోటీలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు మెడల్స్, బహుమతులు అందజేసి క్రీడాకారులను అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమయం అందరికీ సమానంగా ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకునే వారే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. క్రీడల్లో నిరంతర సాధన, పట్టుదలతో ముందుకు సాగాలని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జగిత్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమం లో పలువురు ఉన్నారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్షుడిగా ఉప్పల పవన్, కార్యదర్శిగా దూపకుంట్ల శ్రీనివాస్, కోశాధికారిగా యశోద చరణ్ ఎంపిక.







చర్చ- అశ్వారావుపేటవాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డి.వి. 106 ఏ పరిధిలోని వాసవి క్లబ్ కేసీజీఎఫ్ (KCGF) అశ్వారావుపేట నూతన కార్యవర్గాన్ని 2026 సంవత్సరానికి గాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఉప్పల పవన్, కార్యదర్శిగా దూపకుంట్ల శ్రీనివాస్, కోశాధికారిగా యశోద చరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు క్లబ్ సభ్యులు అభినందనలు తెలియజేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు క్లబ్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు వాసవి క్లబ్ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఆకాంక్షించారు.సమాజ సేవే ప్రధాన లక్ష్యంగా వాసవి క్లబ్ ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, పేదలు, విద్యార్థులు, అవసరంలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని సభ్యులు సూచించారు. అలాగే సభ్యులందరి సహకారంతో ఐకమత్యంగా ముందుకు సాగుతూ క్లబ్‌కు మంచి గుర్తింపు తీసుకురావాలని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

11వ వార్డులో కోతుల పట్టివేత

నేటి చర్చ:- హుస్నాబాద్:మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డులో ప్రభుత్వ పాఠశాల, కళాశాలతో పాటు వార్డులోని పలు ప్రాంతాల్లో కోతుల బెదద నివారణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.శుక్రవారం మున్సిపల్ ఆధ్వర్యంలో కోతులను పట్టించే కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు, విద్యార్థులకు కోతుల వల్ల ఇబ్బందులు కలగకుండా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల భద్రతకు, విద్యాసంస్థల్లో విద్యార్థుల రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సంపత్ నాయక్, కోఆప్షన్ సభ్యురాలు సరోజన, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బాల్ ఎల్లం, రవికుమార్, 11వ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం

రక్తదానం ప్రాణదానంతో సమానం -- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్





నేటి చర్చ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.ఎస్పీ కార్యాలయంపోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సైకిల్ ర్యాలీ, బైక్ ర్యాలీ, వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలతో పాటు అన్ని సబ్ డివిజన్ల పరిధిలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, అత్యవసర సమయాల్లో రక్తం ఎంతమందికి ప్రాణదానం చేయగలదనే విషయాలను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం సమాజానికి అందించే గొప్ప సేవ అని పేర్కొన్నారు.ఈ మెగా రక్తదాన శిబిరంలో విద్యార్థులు, యువకులు, మహిళలు, రాజకీయ ప్రముఖులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు తదితరులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారికి పండ్లు, పండ్ల రసాలను పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎంహెచ్ఓ తుకారం నాయక్, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు వెంకటేశ్వర్లు,



శ్రీలక్ష్మి, జితేందర్, యాసిన్, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, నరేష్, ఆర్ఐలు రవి, లాల్‌బాబు, కృష్ణారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా డీఆర్ఓ పద్మావతి నియామకం
పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలి
వీఐపీ, వీవీఐపీ అతిథి గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలి






నేటి చర్చ :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల అనుమతులు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించేందుకు ప్రత్యేక అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతిని నియమిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను వేగవంతం చేయాలని, అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులను సంబంధిత శాఖల నుంచి త్వరితగతిన పొందాలని ఆదేశించారు. ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేపట్టిన పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, నిధులు, అనుమతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.
గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలంలోని పుష్కర ఘాట్ల అభివృద్ధి, విస్తరణతో పాటు భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై సమీక్షించారు. పుష్కరాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున స్నానపు ప్రదేశాలు, రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి సదుపాయాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పనులను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.
రామాలయం నుంచి పుష్కర ఘాట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న 47 ఇళ్ల తొలగింపునకు సంబంధించిన అంశాన్ని సమీక్షిస్తూ, ఆయా నిర్మాణాల వివరాలు, విలువ అంచనాలు, నిర్వాసితులకు కల్పించాల్సిన పునరావాసం, పరిహారం (ఆర్ అండ్ ఆర్)పై చర్చించారు. బాధితులకు నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.
భద్రాచలం బ్రిడ్జిట్ నుండి పుష్కర ఘాట్ లకు రహదారి విస్తరణకు అవసరమైన భూమి, నిర్మాణాలు, భూసేకరణ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పుష్కర ఘాట్‌కు అనుసంధానంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులు, యాత్రికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.
భద్రాచలంలో వీఐపీ, వీవీఐపీ అతిథి గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. అన్ని వసతులతో ఆరు సూట్లతో కూడిన అతిథి గృహ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి తగిన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని తెలిపారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి, సంబంధిత శాఖల అనుమతులతో ప్రతిపాదనలను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.గోదావరి పుష్కరాల నాటికి ఆలయం, ఘాట్లు, పట్టణ పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా శాఖల వారీగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అధికారులకు అప్పగించిన బాధ్యతలు, పనుల పురోగతికి సంబంధించిన మినిట్స్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, తదుపరి సమీక్షలో వాటి ఆధారంగా పురోగతిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, భద్రాచలం దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, భద్రాచలం తహసీల్దార్ రామ్ కుమార్, దుమ్ముగూడెం తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేట్లకు ఉపాధి పనులపై ప్రత్యేక శిక్షణ

VB-G RAM G పథకం అమలులో పనుల గుర్తింపు. కొలతలపై అవగాహన.



చర్చ :-అశ్వారావుపేట.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, పనుల నాణ్యత, కొలతలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణపై మేట్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించే లక్ష్యంతో అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం గ్రామ రైతు వేదికలో శుక్రవారం VB-G RAM G (వికసిత్ భారత్ -- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ -- గ్రామీణ) పథకంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కిషోర్, మండల ఏపీవో కె. రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలకు చెందిన పంచాయతీ అసిస్టెంట్లు (పీఏలు), ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కలిపి సుమారు 40 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు కె. బాలకృష్ణ, వి. కామేశ్వరి, అస్మా, బి. మహేష్ శిక్షణా కార్యక్రమంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కిషోర్, ఏపీవో కె. రామచంద్రరావు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి పనుల అమలులో మేట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టడంతో పాటు, ప్రతి పనికి సంబంధించి సరైన కొలతలు నమోదు చేయడం, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించడం, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడం వంటి బాధ్యతలను వివరించారు.
ముఖ్యంగా VB-G RAM G పథకం కింద చేపట్టే పనుల విధానం, పనుల గుర్తింపు, పని ప్రదేశాల్లో కొలతలు ఏ విధంగా తీసుకోవాలి, కొలతల నమోదు ప్రక్రియ, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వివరాలు, పనుల నాణ్యతను నిర్ధారించే పద్ధతులపై మేట్లకు క్షుణ్ణంగా వివరించారు.
పనుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనులు చేపట్టే సమయంలో సాంకేతిక అంశాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని తెలిపారు.శిక్షణా కార్యక్రమాన్ని రెండు విడతలుగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నారాయణపురం రైతు వేదికలో తరగతుల ద్వారా పథకానికి సంబంధించిన విధివిధానాలు, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు.

అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అల్లం మహాలక్ష్మి ఫార్మ్ పాండ్ పద్ద క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల ప్రదేశంలో మార్కింగ్ చేయడం, కొలతలు తీసుకోవడం, వాటిని నమోదు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపిస్తూ మేట్లకు ప్రాక్టికల్ శిక్షణ అందించారు. దీంతో కేవలం తరగతి గది బోధనకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పనులు ఎలా నిర్వహించాలనే అంశంపై కూడా అవగాహన కల్పించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో నారాయణపురం గ్రామపంచాయతీ సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ్య, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, నారంవారిగూడెం పంచాయతీ కార్యదర్శి జగదీష్, వ్యవసాయ శాఖ ఏఈఓ రవీంద్ర, సొసైటీ సీఈఓ అరుణ, సండిపోగు రవి తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి అనంతారం, నరంవారిగూడెం, చింతలపాడు, గుమ్మడవెల్లి, కన్నాయిగూడెం, కావాడిగుండ్ల, కొయ్యలగూడెం, కొయ్యరంగాపురం,మల్లయ్యగూడెం, సండిపాడు, నారాయణపురం, రామన్నగూడెం, అచ్చుతాపురం, వేదాంతపురం, గండ్లగూడెం, అసుపాక తదితర గ్రామపంచాయతీలకు చెందిన మేట్లు హాజరయ్యారు.గ్రామీణ ఉపాధి పనులు పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలతో సాగేందుకు మేట్లకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న సాంకేతిక అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ పనుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

హైకోర్టు జస్టిస్ జిల్లా పోర్టుపోలియో జడ్జి K. సుజనా ను కలసి వినతి పత్రం ఇస్తున్న జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కిరణ్ కుమార్



నేటి చర్చ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, హైకోర్టు జస్టిస్ జిల్లా పోర్టుపోలియో జడ్జి ఖ. సుజనా ను కలసి వినతి పత్రం ఇస్తున్న జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కిరణ్ కుమార్ కార్యవర్గ సభ్యులు న్యాయవాదులు.. గతం లో కోర్టు కు కేటాయించిన 10 ఎకరకాల స్థలం (సింగరేణి మగ్గజిన్ ప్రక్క స్థలం నియర్ సంత)లో 10o2 కోర్టు ల నూతన భావననిర్మాణం చేపట్టాలని జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ ఖ. సుజన ను జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కిరణ్ కుమార్ ముదుల్కర్ హైకోర్టు లో ఆమె ఛాంబర్ లో కలసి వినతి పత్రం అందజేశారు... ఈ సందర్భంగా గా కోర్టు లలో న్యాయమూర్తుల కొరత, జిల్లాకు కావలసిన SC/ST, ఫ్యామిలీ, ఎస్టేజ్ , కోర్టులు అవసరాలని ఆమెకు వివరించారు... ఆమె తనవంతు సహాయ సహకారం చేస్తానని హామీ ఇచ్చారు.. అనంతరం జిల్లాకు చెందిన హైకోర్టు జస్టిస్ లు భీమపాక నగేష్, కాజా శరత్ లను కూడా కలసి జిల్లాకు సంభందించిన సమస్య లను వివరించారు.. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి మహేష్ గడిపెల్లి, కార్యవర్గ సభ్యులు K. సంజీవరావు, G. నాగరాజు, దీ. దేవదాస్, భారసోసియేషన్ సలహాదారు రమేష్ కుమార్ మక్కాడ్ న్యాయవాదులు భాగం మాధవరావు, P. ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు..

చలో ఢిల్లీ- ఓటు హక్కును కాపాడుకుందాం

నేటి చర్చ:- హుస్నాబాద్ :ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి గొంతు గర్జించాలి కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్ పటేల్. ఢిల్లీ రాంలీలా మైదానంలో నవంబర్ ఒకటో తేదీన జరుగబోయే ధర్నా కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు రాష్ట్ర రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖ మాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ అన్నగారి సారథ్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో పాటు కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలి వెలుతున్న సందర్భంగా కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్. మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కును తొలిగించి ఓటు చోరికి పాల్పడుతున్న భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ. ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదని దీనికి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ఓటు చోరీ పట్ల స్పందించక పోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. అందుకే మా నాయకుడు రాహుల్ గాంధీ. ఓటు చోరికి వ్యతిరేకంగా డిల్లీ నడిబొడ్డున పోరాటం చేస్తున్నారని,భారత రాజ్యాంగం పరిరక్షించ బడాలంటే ఓటు అనేది కీలకమన్నారు కావున అన్ని రాజకీయ పార్టీల నాయకులు,కుల సంఘాల నాయకులు అందరూ కూడా ఈ పోరాటంలో పాల్గొని రాహుల్ గాంధీ. అడుగులో అడుగేసి కదం తొక్కాలని అన్నారు.ఓటు చోరీ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు ఈ ఉద్యమం ఆగదు అని రానున్న రోజుల్లో దేశ ప్రజలు ఈ ఓటు అనే ఆయుధం ద్వారానే భారతీయ జనతా పార్టీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమానికి కోహెడ మండలం నుండి తరలివెళ్లిన నాయకులు మాజీ సర్పంచ్ లు కర్ర రవీందర్ మరియు దొమ్మాట జగన్ రెడ్డి మరియు మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్ గౌడ్. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు. పెద్ద ఎత్తున ఢిల్లీకి బయలుదేరారు.





బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు కోసం ఎదురుచూస్తున్నా: అక్బర్

ఎన్నో సంవత్సరాలు పార్టీ అభివృద్ధికి కృషి చేశా
తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తారని ఆశాభావం
రాజకీయ భవిష్యత్తుపై త్వరలో నిర్ణయం తీసుకుంటా



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 30 (నేటి చర్చ)కొత్తగూడెం నవభారత్ ప్రాంతానికి చెందిన అక్బర్ తన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నానని ఆయన తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.పార్టీ కోసం గతంలో తాను చేసిన సేవలను, తన రాజకీయ అనుభవాన్ని పార్టీ నాయకత్వం గుర్తించాలని అక్బర్ కోరారు. ప్రస్తుతం మరో రాజకీయ పార్టీ నుంచి తనకు ఆహ్వానం అందిందని, ఆ పార్టీలో చేరాలని కోరుతున్నారని వెల్లడించారు. అయితే ఇప్పటికీ గతంలో పనిచేసిన బీఆర్ఎస్ పార్టీతో తనకు అనుబంధం ఉందని, ఆ పార్టీ నాయకత్వం తనను సంప్రదించి తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.తాను ముస్లిం సోదరుడిగా నవభారత్ ప్రాంతంతో పాటు తనకు పరిచయాలు ఉన్న ప్రాంతాల్లో ముస్లిం సమాజానికి చెందిన పలువురితో పరిచయాలు, సంబంధాలు ఉన్నాయని అక్బర్ పేర్కొన్నారు. తనకు ఉన్న సామాజిక పరిచయాలు, రాజకీయ అనుభవాన్ని పార్టీ నాయకత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు తన విషయాన్ని పరిశీలించి, తనను పిలిచి మాట్లాడి తిరిగి పార్టీలోకి చేర్చుకునే అంశంపై సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకత్వం నుంచి వచ్చే స్పందనను బట్టి తన తదుపరి రాజకీయ నిర్ణయం తీసుకుంటానని అక్బర్ తెలిపారు...

జోహార్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రభుత్వం తొలగించాల్సిందే ఈటల రాజేందర్.

నేటి చర్చ : జవహర్ నగర్, హైదరాబాద్,30 అక్టోబర్ 2026, బిజెపి నేత మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ 27న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపు కొరకు చేపట్టిన మహా పాదయాత్ర నేటికీ నాల్గవ రోజు జవహర్ నగర్ లో భారీ బహిరంగ సభతో ముగీసింది. భారీ వర్షంలో సైతం ప్రజలు, కార్యకర్తలు,అభిమానులు కుర్చీలను తలపై పెట్టుకుని మీటింగ్ లో పాల్గొంటున్నారు.జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో తొలగించాలని లేనియెడల ఈ పోరాటం ఇలానే ఉధృతంగా చేస్తామని ఈటెల రాజేందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడవద్దని డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే చెడు వాసన వల్ల ప్రజలు అనారోగ్యం పాలై మరణించడం జరుగుతుంది, ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడ వద్దని వెంటనే డంపింగ్ యార్డ్ ను తొలగించాలని వ్యర్థ పదార్థాలను రీసైకిల్ చేసి ఇంకోచోట ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీ లు రఘునందన్ రావు, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, ధన్పాల్ ఆయన గుప్తా తదితరులు పాల్గొని, ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డ్ ను ప్రభుత్వం తొలగించాలని లేనిచో భారతీయ జనతా పార్టీ తరఫున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వ్యాఖ్యానించారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి.





చర్చ :- అశ్వారావుపేటరాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అశ్వారావుపేట బీఆర్ఎస్ నాయకురాలు కాసాని నాగశేషాపద్మ, కౌన్సిలర్ డాక్టర్ ఉదయ్ జ్యోతి కోరారు. పట్టభద్రుల ఓటరు నమోదు గడువు నవంబర్ 6వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో అర్హులైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
2023 నవంబర్ 1వ తేదీ నాటికి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు.
ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో నివాసం ఉంటున్న అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.
అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం, ఆసుపాక, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, పాత రెడ్డిగూడెం గ్రామ పంచాయతీల పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ఓటరు నమోదుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.
దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ (సీఎంఎం, ఒరిజినల్ లేదా ప్రొవిజనల్), పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఫోన్ నంబర్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.పట్టభద్రులు స్వయంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆన్‌లైన్ విధానంపై అవగాహన లేనివారికి ఉచితంగా దరఖాస్తు నమోదు చేసేందుకు సహకరిస్తామని వారు తెలిపారు. అవసరమైన ధ్రువపత్రాలను వాట్సాప్ ద్వారా పంపిస్తే ఉచితంగా ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు సహాయం అందిస్తామని వెల్లడించారు.అర్హులైన పట్టభద్రులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా సకాలంలో తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ద్వారా తమ భాగస్వామ్యాన్ని చాటుకోవాలని కాసాని నాగశేషాపద్మ, డాక్టర్ ఉదయ్ జ్యోతి కోరారు.ఆన్‌లైన్ నమోదు: https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx
వివరాలకు, ఉచిత నమోదు సహాయానికి: 8142559370
ఓటరు నమోదు చివరి తేదీ: నవంబర్ 6

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే..!

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష.. మరో ఇద్దరికి జరిమానా.



చర్చ:- అశ్వారావుపేట.మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే ఇకపై జరిమానాలతో సరిపెట్టే పరిస్థితి ఉండదని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జైలు శిక్షలు తప్పవని అశ్వారావుపేట పోలీసులు హెచ్చరిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురిని శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపరచగా, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల పోలీసులు ప్రత్యేకంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిపై సంబంధిత కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులను విచారించిన న్యాయస్థానం ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించగా, మరో ఇద్దరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించింది. డ్రంకెన్ డ్రైవ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేస్తోంది.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారుల ప్రాణాలకే కాకుండా రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మద్యం మత్తులో వాహనం నడిపే సమయంలో వేగాన్ని నియంత్రించలేకపోవడం, రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలను సరిగ్గా గుర్తించలేకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్.ఐ సాయి కిషోర్ రెడ్డి స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేయడంతో పాటు న్యాయస్థానం ద్వారా తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు పోలీసుల తనిఖీలకు భయపడి కాకుండా, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలనే బాధ్యతతో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మద్యం సేవించి వాహనం నడపకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని ఎస్.ఐ సాయి కిషోర్ రెడ్డి కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నీటి ఎద్దడి ముంచుకొస్తుంటే.. శుద్ధి చేసిన నీటి వృథా ఎందుకో ..?

జగిత్యాలలో వాటర్ ప్లాంట్ల నుంచి మురుగు కాలువల్లోకి వృథాగా నీరు..
ఇంకుడు గుంతలకు మళ్లించేందుకు అధికారులకు చిత్తశుద్ధి ఏది...?



చర్చ, జగిత్యాల : రానున్న వేసవిలో ఎల్‌నినో ప్రభావంతో ఎండలు తీవ్రతరమై నీటి కొరత ఏర్పడే అవకాశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, జగిత్యాల పట్టణంలో ప్రతి నీటి చుక్కను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అయితే పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్లలో నీటిని ఫిల్టర్ చేసే ప్రక్రియలో మిగిలే నీటిని తిరిగి వినియోగించకుండా మురికి కాలువల్లోకి వదులుతున్నారనే అంశం పర్యావరణం, నీటి సంరక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.
వృథాగా పోతున్న నీటిని ఒడిసిపట్టలేరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
వాటర్ ప్లాంట్లలో ఫిల్టరేషన్ ప్రక్రియలో వెలువడే నీటిని దాని నాణ్యత, వినియోగానికి అనుగుణంగా తిరిగి ఉపయోగించుకునే అవకాశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. అలా కాకుండా ఆ నీటిని నేరుగా మురుగు కాలువల్లోకి పంపిస్తే, నీటి వృథాతో పాటు స్థానికంగా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, నీటి కొరతపై ముందస్తు హెచ్చరికలు వినిపిస్తున్న సమయంలో ఈ పరిస్థితిని అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదనే అభిప్రాయాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.
ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలకు ఊతం
వాటర్ ప్లాంట్ల నుంచి వెలువడే నీటిని శాస్త్రీయంగా పరిశీలించి, అనువైన చోట్ల ఇంకుడు గుంతలు లేదా ఇతర రీఛార్జ్ వ్యవస్థల ద్వారా భూమిలోకి మళ్లించే అవకాశాలను అధికారులు పరిశీలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అలాగే ఫిల్టర్ వ్యర్థాల్లో అధిక మలినాలు, రసాయనాలు, ఇతర కలుషితాలు ఉంటే వాటిని నేరుగా భూగర్భంలోకి పంపకుండా తగిన శుద్ధి, నాణ్యత పరీక్షలు తప్పనిసరిగా చేపట్టాలని కోరుతున్నారు. నీటి స్వభావాన్ని బట్టి సరైన పద్ధతిని ఎంచుకుంటే భూగర్భ జలాల పెంపునకు దోహదపడే అవకాశం ఉంటుందని,
అధికారులు ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని
జగిత్యాల మున్సిపల్ అధికారులు, సంబంధిత కాలుష్య నియంత్రణ అధికారులు పట్టణంలోని వాటర్ ప్లాంట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రోజుకు ఎంత నీరు ఫిల్టరేషన్ ప్రక్రియలో వృథా అవుతోంది, ఆ నీటిలో ఎంత శాతం తిరిగి వినియోగించుకోవచ్చో, ఎక్కడ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి అనే అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నీటిని మురుగు కాలువల్లోకి వదులుతున్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలి.వాటర్ ప్లాంట్ల యజమానులకు నీటి పునర్వినియోగం, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతున్నారు. సాధ్యమైన చోట్ల ఇంకుడు గుంతల ఏర్పాటును ప్రోత్సహించడంతో పాటు వాటి నిర్వహణపైనా పర్యవేక్షణ ఉండాలని,నీటి కొరత వచ్చిన తర్వాత ప్రత్యామ్నాయాల కోసం పరుగులు తీయడం కంటే, అందుబాటులో ఉన్న నీటిని ఇప్పటి నుంచే సంరక్షించడం మేలని, ప్రతి నీటి చుక్క విలువైనదేనని, మురుగు కాలువల్లో కలిసిపోతున్న నీటిని సద్వినియోగం చేసుకునే దిశగా జగిత్యాల అధికారులు ఇప్పటికైనా కార్యాచరణ చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రబీ సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలి

తక్కువ నీటితో పండే పంటల సాగుకే ప్రాధాన్యత ఇవ్వాలి
-- మండల వ్యవసాయ అధికారి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి.



చర్చ :- దమ్మపేట.రాబోయే రబీ సీజన్‌లో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో 'కేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా గ్రామ రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న రబీ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలు, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, వ్యవసాయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని, వచ్చే మార్చి నెల వరకు ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేయాలని సూచించారు. ముఖ్యంగా సాగునీటి లభ్యతను అంచనా వేసుకొని, తక్కువ నీటితో తక్కువ కాల వ్యవధిలో చేతికి వచ్చే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.అపరాల పంటలైన పెసర, మినుము, శనగ వంటి పంటలతో పాటు వివిధ రకాల కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే నష్టాలను కొంతవరకు నివారించుకోవచ్చని వివరించారు. ముఖ్యంగా ఈ రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్న పంటల సాగును సాధ్యమైనంత వరకు వాయిదా వేసుకోవాలని, నీటి వనరులు సమృద్ధిగా ఉన్నాయనే భరోసా లేకుండా అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని రైతులకు సూచించారు.అనంతరం విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ..
రాబోయే రోజుల్లో విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని, దీనివల్ల వ్యవసాయ అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశాన్ని రైతులు దృష్టిలో ఉంచుకోవాలని తెలిపారు. రైతులు ముందుగానే అప్రమత్తమై తక్కువ నీరు, తక్కువ విద్యుత్ వినియోగంతో సాగు చేసుకునే పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి వృథాను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని అధికారులు పేర్కొన్నారు. రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ సాగు చేపట్టాలని తెలిపారు.ఈ సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

కమలాపూర్ ఆరోగ్య కేంద్రాల్లో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆకస్మిక తనిఖీ



కమలాపూర్, అక్టోబర్ 30

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా



కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కమలాపూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.రోజువారీ ఓపీ సేవలు, రోగుల వివరాల ఆన్‌లైన్ నమోదుపై కలెక్టర్ ఆరా తీశారు. పురుషులు, మహిళల వార్డులు, టీకాల గది, వైద్య రికార్డుల విభాగం, మందుల నిల్వలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..



ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మందుల నిల్వ, నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు

న్యాయవాది ఇంటిపై దాడిని ఖండించిన బార్ అసోసియేషన్

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి



భూపాలపల్లి, : న్యాయవాది పైతర అజయ్ ఇంటిపై జరిగినట్లు పేర్కొన్న దాడిని భూపాలపల్లి జిల్లా బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన నేపథ్యంలో అత్యవసర జనరల్ బాడీ సమావేశం నిర్వహించిన న్యాయవాదులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఒక కేసు ఆలస్యం కావడానికి తానే కారణమంటూ కొందరు వ్యక్తులు తన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి భౌతిక దాడికి పాల్పడ్డారని అజయ్ ఆరోపించారు. దాడిలో ఒక మున్సిపల్ కౌన్సిలర్ పాల్గొని నాయకత్వం వహించినట్లు బాధితుడు పేర్కొన్నారు.సమావేశం అనంతరం ఘటనను జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లిన న్యాయవాదులు, జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. దాడికి పాల్పడిన వారిపై వర్తించే చట్టాల కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులు, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఘటనపై గణపురం పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదైనట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.న్యాయవాదులపై దాడులు వారి వృత్తి స్వేచ్ఛకు ముప్పు కలిగిస్తాయని సమావేశంలో పలువురు పేర్కొన్నారు. నిర్భయంగా వృత్తి బాధ్యతలు నిర్వర్తించే వాతావరణం కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులపై దాడులు జరిగితే బార్ అసోసియేషన్ తరఫున ఐక్యంగా పోరాడుతామని స్పష్టం చేశారు.

జనగణనతోపాటు బీసీ కులగణన చేపట్టాలి

- **డిక్లరేషన్ల హామీలను అమలు చేయాలని**

రౌండ్‌టేబుల్ సమావేశంలో డిమాండ్

వరంగల్, అక్టోబర్ 30:

కేంద్ర ప్రభుత్వం జనగణనతోపాటు బీసీ కులగణన చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్, వరంగల్ రైతు డిక్ల రేషన్, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ చేయూత డిక్లరేషన్లలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు డిమా ండ్ చేశారు.వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో బీఎల్ఎఫ్ ఆధ్వ ర్యంలో వామపక్ష ప్రజాసంఘాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, బీసీ సంఘాల ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకుడు నర్రా ప్రతాప్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కొంగ వీరుస్వా మి హాజరై ప్రసంగించారు. బీసీలకు సామాజిక న్యాయం కల్పిం చేందుకు కులగణన చేపట్టాలని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన



హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమావే శంలో నాయకులు కోరారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన

సమితి జిల్లా కార్యదర్శి చింతగింది కుమారస్వామి, పూలే సామా జిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేరళ ప్రసాద్, బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బనుక సిద్దిరాజు యాదవ్, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖాసిం, తెలంగాణ రైతు సంఘం నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్, ఓదెల రాజన్న, చుక్క మొగిలి పాల్గొన్నారు.అలాగే ఏఐకేఎస్ జిల్లా కన్వీనర్ సుధామల్ల భాస్కర్, బీఎల్ఎఫ్ నాయకులు కుసుంబా బాబురావు, ముక్కెర రామస్వామి, మాలోత్ సాగర్, వంగాల రాగసుధ, ఏఐసీటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుంచు జగదీశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి, మహిళా సంఘం నాయకురాలు సంధ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలి

మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషా శ్రీనివాస్ పిలుపు





వరంగల్, అక్టోబర్ 30:

వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం శివనగర్‌లోని పల్లవి ఆసుపత్రి ఎదుట శు క్రవారం పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు.34వ డివిజన్ అధ్యక్షుడు చిట్టిమల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, వైద్యులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన పట్టభద్రులు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.శామంతుల ఉషా శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టభద్రులు నవంబర్ 6లోపు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలని కోరారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావుల విజయ రామచందర్, పోలేపాక నరేందర్, మారేడుపాక హరికృష్ణ, కే.రాధిక, విజయలక్ష్మి, బిక్షపతి, పట్టురి సుధాకర్, మధు, శ్రీధర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై అపార్ట్‌మెంట్లలో అవగాహన

లక్కీ అపార్ట్‌మెంట్స్‌లో గడపగడపకు వెళ్లి ఓటరు నమోదు కార్యక్రమం.

చర్చ :- అశ్వారావుపేటరాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలనే లక్ష్యంతో అశ్వారావుపేట పట్టణంలో గడపగడపకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని లక్కీ అపార్ట్‌మెంట్స్ (1, 2)లో ప్రతి ఇంటికి వెళ్లి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హత కలిగిన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుకు అవసరమైన వివరాలను సేకరిస్తూ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.కాసాని పద్మ, 14వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఉదయ జ్యోతి, మాజీ టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా వారు అపార్ట్‌మెంట్లలోని ప్రతి ఇంటిని సందర్శించి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాధాన్యతను నివాసితులకు వివరించారు. డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి, ఓటరు నమోదుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య





వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవడం అవసరమని తెలిపారు. ఓటరు నమోదు విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా, నిర్దిష్ట గడువులోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోనూ పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు ఆవశ్యకతను వివరించడంతో పాటు, అర్హులైన వారు ఎవరూ నమోదు కాకుండా మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటి ప్రచారం ద్వారా ఓటరు నమోదు ప్రక్రియపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ, అవసరమైన సమాచారాన్ని అందించారు. పట్టభద్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మోటూరి మోహన్, శివ, రాజనాల గంగాధర్, కొప్పుల గంగాధర్, గౌతమి, కావ్య, పండు తదితరులు పాల్గొని ఓటరు నమోదు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి

- **మంగపేట సమావేశంలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, బడే నాగజ్యోతి పిలుపు**



మంగపేట, అక్టోబర్ 30:

రానున్న వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ



ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు.మంగపేట మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శు క్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పట్టభద్రుల ఓటరు నమోదు, పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఓటర్లతో సమన్వయం చేసు కుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవిందా నాయ క్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, జిల్లా నాయకులు తాటి కృష్ణ, కాకులమర్రి ప్రదీప్‌రావు, జగదీష్, కూర్బన్ ఆలీ, చిలకమర్రి రాజేందర్, చిట్టీమల్ల సమ్మయ్య, కర్రి శ్యాంబాబు పాల్గొన్నారు.అలాగే మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరేం సంతోష్, మల్లూర్ దేవస్థాన మాజీ చైర్మన్ ముకుందం, యువజన విభాగం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశా నాగారమేష్, జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, గ్రామ కమిటీల మాజీ అధ్యక్షులు నూనె లింగయ్య, తుక్కని శ్రీనివాస్, ఉడుగుల శ్రీనివాస యాదవ్, రూప భద్రయ్య, సోయం ఈశ్వర్, సాంబులు, నర్సింహారావు, పొదేం రాంబాబు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

కమలాపూర్‌లో ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

కమలాపూర్, అక్టోబర్ 30: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కమలాపూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రతిరోజూ ఓపీ సేవలకు ఎంతమంది వస్తున్నారని, రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అని వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురుషులు, మహిళల వార్డులు, ఓపీ నమోదు వివరాలను పరిశీలించారు. టీకాల గది, వైద్య రికార్డుల విభాగం, మందుల నిల్వ గదిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మందుల నిల్వ, నిర్వహణ సక్రమంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఉపాధి అండగా.. పనులు మెండుగా..

హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో ఊళ్లల్లో ఉపాధి హామీ పనులు ఊపందుకుంటున్నాయి. వర్షాభావ పరి స్థితులు, మండలాల్లో కరువు ఛాయలు నెల కొంటున్న నేపథ్యంలో పేద కుటుంబాలకు దక్కు తున్న పనులు వారికి కొండంత అండగా నిలుస్తున్నాయి. యాసంగి సీజన్ లో వ్యవసా యం ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణం లో వీబీ జీరామ్‌జీ పనులు ఆర్థిక భరోసాను కల్పిస్తు న్నా యి. రాష్ట్ర వ్యాప్తం గా ఈనెల 27న రికార్డు స్థాయిలో నాలుగు లక్షలకు చేరువగా (3,97,910) కూలీలు పను లకు హాజరైన తీరే ఇందుకు నిదర్శనం.ఈ ఒక్క నెలలోనే ఇప్పటికే 60 లక్షలకుపైగా పని దినాలను కల్పించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత నెలలో వికసిత్ భారత్ పంచాయతీ ప్రణాళిక (వీజీపీపీ)లో భాగంగా నిర్వహించిన గ్రామసభల్లో మరిన్ని కొత్త పనులను ఎంపిక చేయడం కూలీలకు వరంగా మారింది. ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేం దుకు గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గ్రామ స్తులే ఎంపిక చేయడంతో ఉన్న ఊళ్లో ఉపాధిని పొందే అవకాశాలు మెరుగయ్యాయి. దీంతో ప్రతినిత్యం పనిప్రదేశాలకు వెళ్లే కూలీల



సంఖ్య అన్ని జిల్లాల్లో పెరిగింది. తంతో పోలిస్తే ఈ నెలలో ఉపాధి పనులకు ఊళ్లల్లో డిమాండ్ పెరుగుతోంది. వ్యవసాయ పనులు తగ్గుతుండడంతో గ్రామాల్లో నీటి సంరక్షణ పనులకు ఉపాధి పనుల్లో ప్రాధాన్యమిస్తున్నారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరిచే పనులు, కందకా లు, వాన నీటి సంరక్షణకు సంబంధించి నిర్మాణాలు మొదలగు పనులకు కూలీలు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. మొక్కల పెంపకం, మౌలిక వసతుల కల్ప న దిశగా జాబ్‌కార్డు కలిగిన వారికి పని దక్కేవిధంగా ఉపాధి హామీ సిబ్బంది ప్రతి నిత్యం పర్యవేక్షణ పెం చుతున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధికి ఇస్తున్న ప్రాధాన్యం దృష్ట్యా ఆయా జిల్లాల కలెక్టర్లు రోజువారీగా కూలీల సంఖ్యను పెంచేందుకు క్షేత్ర స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఎంపీడీవోలను పనుల తీరుని గమనించడంతోపాటు కూలీల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలనే విధంగా ఆదేశతీరుని గమనించడంతోపాటు కూలీలాలు జారీ చేయడంతో గ్రామాల్లో ఉపాధి పనుల పండుగ వాతావరణం నెలకొంది.ఈనెల 25న ఆదివారం మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులకు 25,525 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా రోజుల్లో సగటున రెండు లక్షలకు పైగా కూలీలు హాజరవుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింతగా పెరిగితే పల్లెల్లోని పలు కుటుంబాలకు దినసరి వేతనం రూపంలో కూలీలకు మరింత ఆర్థిక ఆసరా లభించే వీలుంటుంది.

రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతా.. ఈటల సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 30: జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలంటూ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. ఈ సందర్భంగా పాదయాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతానని స్పష్టం చేశారు. 'నేను డంప్ యార్డు తీసేయాలని పాదయాత్ర చేస్తుంటే ఈటల రాజేందర్ పనిలేక తిరుగుతున్నారంటూ కాంగ్రెస్ నాయకులు అంటున్నారట.. ఈ డంప్ యార్డ్‌ను



తొలిగించే వరకు మాత్రమే కాదు.. మీ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతా' అంటూ వ్యాఖ్యానించారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డు రీసైకిల్ కోసం ఎంత ఖర్చవుతుందో డీపీఆర్ చేసి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. ప్రధాని నరేంద్ర నరేంద్ర మోదీని ఒప్పించి అవసరమైన డబ్బులను తీసుకొస్తామని ప్రకటించారు. అలా తీసుకురాలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా అంటూ ఎంపీ ఈటల రాజేందర్ ఛాలెంజ్ విసిరారు.కాగా.. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలంటూ ఈనెల 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్రను మొదలుపెట్టారు. ఈ డంపింగ్ యార్డు వల్ల వెలువడే కాలుష్యంతో చుట్టుపక్కల గ్రామాలు, కాలనీల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని తెలిపారు. గాలి, భూగర్భ జలాలు కలుషితమయ్యాయని.. వెంటనే డంపింగ్ యార్డును తొలగించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

హాస్యాస్పదంగా ఓటు చోరీపై రాహుల్ గాంధీ ధర్నా

హైదరాబాద్ :



ఓటు చోరీ గురించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ ధర్నా చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డిని పక్కన పెట్టుకుని రాహుల్ గాంధీ ఓటు చోరీ గురించి ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక ఓటుకు నోటు దొంగనే అడ్డంగా పెట్టుకుని.. దొంగతనం చేస్తూ రూ.50 లక్షల రూపాయల బ్యాగ్‌తో దొరికిపోయిన రేవంత్ రెడ్డిని పక్కకు పెట్టుకొని రాహుల్ గాంధీ ఓటు చోరీ గురించి ధర్నా చేస్తున్నారంటే అసలు ప్రజలు ఏమనుకుంటున్నరో.. ఏందో అనే ఆలోచన కూడా లేదన్నారు..అసలు మోదీకి ఎవరూ అవసరం లేదు.. ఈ రాహుల్ గాంధీ ఉంటేనే సరిపోతదని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎద్దేవా చేశారు.. ఇవాళ రాహుల్ గాంధీ ధేడ్ దిమాఖ్ పనులు చేస్తున్నడు కాబట్టే మోదీ అక్కడ కూర్చొని ఉన్నడు. ఇది నేను చెబుతున్నది వాస్తవం.. నేటి నిజం.. ఏది అబద్దం కాదని స్పష్టం చేశారు.

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా.. మళ్లీ మారిన షెడ్యూల్

హైదరాబాద్ :రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎ×=) కార్యక్రమ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి మార్పు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈవోలు) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా మార్పులతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటర్ల తుది జాబితా నవంబర్ 30వ తేదీన ప్రచురితం కానుంది.ఈ మేరకు ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల సీఈవోలకు వేర్వేరుగా సమాచారం అందించింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించిన గడువును తెలంగాణలో నవంబర్ 26 వరకు, ఆంధ్రప్రదేశ్‌లో నవంబర్ 20 వరకు పొడిగించింది. వాస్తవానికి పాత షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నవంబర్ 9న, ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 30నే తుది జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో సీఈవోల అభ్యర్థన మేరకు ఈసీ గడువును పొడిగించింది.సవరించిన షెడ్యూల్ వివరాలను క్షేత్రస్థాయి అధికారులందరికీ తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఈసీ తమ ఆదేశాల్లో స్పష్టం చేసింది. అదేవిధంగా మార్పు చేసిన షెడ్యూల్ గురించి



రాజకీయ పార్టీలకు కూడా రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించింది.గణాంకాల వివరాలుప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,64,87,213 మంది మాత్రమే తమ వివరాలను నమోదు చేసుకున్నారు. మిగిలిన 73,39,235 మంది ఓటర్లను వలస వెళ్లినవారు, మరణించినవారు, చిరునామా మారినవారు, నకిలీ ఓట్ల కేటగిరీ కింద గుర్తించి డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించారు.అక్టోబర్ 29 నాటికి అందిన సమాచారం ప్రకారం.. తెలంగాణలో జారీ చేసిన 92,88,188 నోటీసులకు గానూ 92,81,189 నోటీసులు ఓటర్లకు అందజేశారు. వీటిలో 92,08,443 నోటీసులపై విచారణ పూర్తయింది. ఇప్పటివరకు మొత్తం 2,59,22,684 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి అధికారులు ఆమోదం తెలిపారు. వీరిలో 59,31,395 మంది ఓటర్ల విషయంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. మరో 30,64,168 మందిని 2002 నాటి జాబితా నుంచి మ్యాపింగ్ చేశారు. విచారణ అనంతరం 50,690 మంది ఓటర్లు జాబితాలో చేరడానికి అర్హులు కారని అధికారులు తేల్చారు.ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 44,28,858 నోటీసులపై విచారణ పూర్తయింది. వీరిలో 42,55,630 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి ఆమోదం లభించింది. పరిశీలన తర్వాత 1,73,662 మంది ఓటర్లు జాబితాలో చోటు దక్కించుకోవడానికి అర్హులు కారని అధికారులు నిర్ధారించారు.

రేవంత్ అసమర్థతో హరిగోస పడుతున్న రైతాంగం : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

మహబూబ్ నగర్ : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లాలోని పెద్దగూడెం తండాలో కరెంట్ కోతలతో ఎండిపోయిన వరి పంటలను బీఆర్ఎస్) శ్రేణులతో కలసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మీడియాతో మాట్లాడారు.ఇది నిజమైన కరువు కాదని, ముమ్మాటికి కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్ నినో పేరుతో కాలం వెలిబుచ్చు తున్నా రని విమర్శించారు. పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా సమీక్ష నిర్వహించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంపై ప్రత్యక్షంగా,పరోక్షంగా రెండున్న ర కోట్ల మంది రైతులు ఆధారపడి ఉన్నార, ని వారంతా ప్రభుత్వంపై తిరగబడే అనివార్యత ప్రభుత్వమే కల్పించిం దని పేర్కొన్నారు. రైతులు



అధైర్య పడొద్దని అండగా ఉంటామని, ప్రభుత్వంతో పోరాడి నష్టపరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే ఓటు వేసినందుకు చెప్పుతో కొట్టుకుంటామని బహిరంగం చెబుతున్నా ఈ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదని విమర్శించారు.రేవంత్ రెడ్డికి కరెంట్ సరఫరాపై అవగాహన, సోయి లేదని అన్నారు. నేటికి శ్రీశైలం ప్రాజెక్టులో 70 టీఎంసీల నీటి లభ్యత ఉందని, నీటి లభ్యత ఉన్నా పాలమూరు, కల్వకుర్తి పంపులు నడుపతలేరని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని నడపడంలో ఘోరమైన వైఫల్యం చెందిందని వెల్లడించారు.ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్ , నందిమల్ల అశోక్, కె.మాణిక్యం, రఘువర్ధన్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, ధర్మా నాయక్, మాధవ్ రెడ్డి, సునీల్ వాల్మీకి, శంకర్ నాయక్, చిట్యాల రాము, నారాయణ నాయక్, టీక్యా నాయక్, గోవిందు నాయక్, అలీం పాల్గొన్నారు.

ఉద్యోగానికే రిటైర్మెంట్, సమాజ సేవకు కాదు: కోదండరాం



ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగానికి మాత్రమే పరిమితమని, సమాజ సేవకు ఎలాంటి విరమణ ఉండదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. కొందరు ఉద్యోగులు కేవలం తమ విధులకు మాత్రమే పరిమితమవుతారని, అలాంటి వారికి పదవీ విరమణ వర్తించవచ్చని అన్నారు. కానీ, కొందరు ఉద్యోగ బాధ్యతలతో పాటు పలు రంగాల్లో సమాజ సేవలోనూ చురుకుగా పాల్గొంటారని, అలాంటి వారికి నిజమైన విరమణ ఉండదని చెప్పారు. జడ్చర్లలో నిర్వహించిన ఎంఈఓ మంజులాదేవి పదవీ విరమణ సన్మాన సభలో కోదండరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మంజులాదేవి వంటి వారికి పదవీ విరమణ ఉండదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎమ్మెల్సీ కేపీఎన్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎ. శేఖర్, ప్రతాప్ రెడ్డి, ఆర్జేడీ సోమిరెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు కూడా పాల్గొని మంజులాదేవికి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.

రేవంత్ రెడ్డి.. అనుముల ఇంటెలిజెన్స్ కాదు, తెలంగాణ ఇంటెలిజెన్స్ ఉపయోగించాలి



హైదరాబాద్ : అనుముల ఇంటెలిజెన్స్ కాదు తెలంగాణ ఇంటెలిజెన్స్ ఉపయోగించు అని సీఎం రేవంత్ రెడ్డికి ఆర్ఎస్ ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. టీజీ-ఐపాస్ పోర్టల్‌పై సైబర్ దాడి జరిగి సేవలు నిలిచిపోయాయి. దీంతో పరిశ్రమలకు అప్లికేషన్ పెట్టుకునే పరిస్థితి ఉండదన్నారు. కానీ, రేవంత్ రెడ్డి పోయి గ్లోబల్ సమ్మిట్‌లో ూ× అని మాట్లాడుతున్నాడు. ముందు తెలంగాణలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను మేము ప్రశ్నిస్తే దాని మీద అధికార కాంగ్రెస్ నాయకులు ధర్నాలు చేస్తారు. మామూలుగా ప్రతిపక్షాలు ధర్నా చేస్తాయి కానీ కాంగ్రెస్ ప్రతిపక్షంగా మారి ప్రర్తిస్తుందని, ఇదో పెద్ద జోక్ మారిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి మందు చూపు తప్ప ముందు చూపు లేదు: రఘునందన్ రావు

సిద్దిపేట, అక్టోబర్ 30: వ్యవసాయం అనేది రాష్ట్ర ప్రభుత్వ అంశమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. (శుక్రవారం) ఏబీఎన్‌తో మాట్లాడుతూ. ఢిల్లీకి ఎన్నిసార్లు తిరిగారో అన్ని సార్లు రైతుల వద్దకు తిరిగి ఉంటే. వారికి నీళ్లు, కరెంట్ ఎంత అవసరం ఉంటుందో తెలిసేదన్నా రు. ఈ ప్రభుత్వానికి ఏ ఆలోచనా లేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అయితే ఏకంగా రబీ సాగు చేయొద్దని రైతులకు చెబుతున్నారని మండిపడ్డారు. సంగారెడ్డి చుట్టూ ఉన్న ప్రభుత్వ పరిశ్రమలకు 50 శాతం మాత్రమే నీళ్లు ఇవ్వాలని చెప్పిన ప్రభుత్వం, బీరు కంపెనీలకు మాత్రం వంద శాతం నీళ్లు ఇస్తున్నారని విమర్శించారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వానికి మందు చూపు తప్ప.. ముందు చూపు లేదంటూ వ్యాఖ్యానించారు.



మందు కావలి కానీ.. జిల్లా ప్రజలకు నీళ్లు ఇవ్వడానికి మాత్రం ముందు చూపు లేదంటూ ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అఖిలపక్షం తీసుకున్న నిర్ణయా లకు తాము కూడా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర పెద్దలు వస్తే. కేంద్రం పది రూపాయలు ఇచ్చేలా ఉంటే 15 రూపాయలు ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ కూడా ఆరోపణలు, విమర్శలు తప్ప ఇద్దరూ గ్రౌండ్‌లో పని చేయడం లేదని విమర్శించారు. మల్లన్నసాగర్‌లో నీళ్లు లేవని ప్రభుత్వమే చెబుతోందని.. మరి 20 టీఎంసీలు ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు.

'కాంగ్రెస్‌కు ముందు చూపు లేదు, ఆలోచన లేదు.. చెప్పిన మాటలు ఆచరించే నైజం లేదు. కాళేశ్వరం ఉందా లేదా.? రిపేర్ చేస్తారా లేదా..? కాళేశ్వరం పనికి వస్తదా లేదా.. అనేది ఈ రోజు వరకు కాంగ్రెస్ చెప్పలేదు. మొత్తం ప్రాజెక్ట్‌పై విచారణ చేయాలని మేము అడుగుతున్నాం.. కానీ మూడు బ్యారేజ్‌ల గురించే కాంగ్రెస్ మాట్లాడుతుంది. కాంగ్రెస్ ఎలాంటి భరోసా ఇవ్వదు. కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో సున్నా సీట్లని ఆ పార్టీకి మనమే భరోసా ఇవ్వాలి. సర్‌పై కాంగ్రెస్ ఆందోళనలు రాజకీయంగా చేస్తున్న క్రీనిడలు తప్ప మరోటి కాదు. రాజ్యాంగ వ్యవస్థల్ని విచ్ఛిన్నం చేయాలనే దుర్మార్గ ఆలోచన తప్ప మరోటి కాదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకరికొకరు కలిసి పని చేస్తున్నాయని... బీజేపీ ప్రజలతో కలిసి పని చేస్తుంది' అంటూ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

ఆర్నబ్ తుపాను కష్టాల్లో ఏపీకి అండగా తమిళనాడు



అమరావతి, అక్టోబర్ 30: తుపాను అర్నబ్ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడారు.తుపాను సృష్టించిన విధ్వంసం, విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పునరుద్ధరణ పనులకు అదనపు సిబ్బంది, సామగ్రి అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని మంత్రి గొట్టిపాటి కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తమిళనాడు ప్రభుత్వం.. ఏపీకి విద్యుత్ సిబ్బందితో పాటు అవసరమైన సామగ్రిని పంపేందుకు సుముఖత వ్యక్తం చేసింది. దీంతో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులకు మరింత బలం చేకూరనుంది.ఆర్నబ్ తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను వీలైనంత త్వరగా సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల సహకారం తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వాన్ని కూడా విద్యుత్ పునరుద్ధరణ పనులకు సహాయం అందించాలని కోరింది. తెలంగాణ సరిహద్దు జిల్లాల నుంచి విద్యుత్ శాఖ సిబ్బంది తుపాను ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని మరమ్మతు పనుల్లో పాల్గొంటున్నారు. మరోవైపు తమిళనాడు నుంచి కూడా సిబ్బంది, సామగ్రి అందుబాటులోకి వస్తే సహాయక చర్యలు మరింత వేగవంతం కానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు.

రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు. రెండో విడత నిధుల విడుదల!



అమరావతి, అక్టోబర్ 30: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం రెండో విడత కింద నేడు రూ.3,125.47 కోట్ల ఆర్థిక సాయం విడుదలకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలకు ఈ నిధులు అందనున్నాయని పేర్కొన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.782.55 కోట్లుగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6 వేలు సమకూరుస్తున్నాయని వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఖరీఫ్‌లో రూ.7 వేలు, రబీలో రూ.7 వేలు, వేసవిలో రూ.6 వేల చొప్పున మూడు విడతల్లో రైతులకు సాయం అందిస్తున్నట్లు చెప్పారు.

రైతులకు ఆర్థిక భరోసా.. రూ.17,789 కోట్లకు చేరనున్న సాయం..రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అచ్చెన్నాయుడు తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.8,985.41 కోట్లు, 2026--27 తొలి విడతలో రూ.3,125.47 కోట్లను రైతులకు అందించినట్లు పేర్కొన్నారు. నేటి రెండో విడత నిధులతో పాటు 2024--25 సంవత్సరానికి సంబంధించిన పీఎం కిసాన్ నిధులను కలుపుకుంటే రైతులకు అందించే మొత్తం ఆర్థిక సాయం రూ.17,789.80 కోట్లకు చేరుతుందని వెల్లడించారు. చంద్రబాబు నాయకత్వం, ప్రధాని మోదీ సహకారంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులకు సాగు పెట్టుబడి సమయంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా సాయం అందిస్తున్నామని, ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కష్టసమయాల్లోనూ ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు.

నిజాయతీపరుడైన అధికారిని కోల్పోయాం.. బాలసుబ్రహ్మణ్యం మృతిపై చంద్రబాబు,లోకేశ్ దిగ్భ్రాంతి



అమరావతి:ఆయన మృతి పట్ల చంద్రబాబు, నారా లోకేశ్ తీవ్ర సంతాపం నిజాయతీ, సంస్మరణలకు బాలసుబ్రహ్మణ్యం పెట్టింది పేరని కొనియాడిన నేతలు ఆధునిక పోలీసింగ్‌కు ఆయన మార్గదర్శకులని లోకేశ్ నివాళి కొన్ని నెలల క్రితం వరకు ఏపీకి సేవలు అందించారని గుర్తు చేసుకున్న చంద్రబాబు

రిటైర్డ్ డీజీపీ ఎన్. బాలసుబ్రహ్మణ్యం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బాల సుబ్రహ్మణ్యం నిజాయతీకి, నిబద్ధతకు మారు పేరని, ఆయన మరణం తనను తీవ్ర విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు.ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ.. ‘‘బాలసుబ్రహ్మణ్యం గారు నిజాయతీ విషయంలో ఎన్నడూ రాజీపడని అధికారి. దృఢమైన నిర్ణయాలు, ప్రగతిశీల ఆలోచనలతో ఆయన ఎంతో గౌరవం సంపాదించుకున్నారు. పోలీసింగ్, ఇంటెలిజెన్స్, రవాణా, ప్రభుత్వ పాలన వంటి వివిధ శాఖల్లో తనదైన ముద్ర వేశారు. సంస్కరణలు, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ఆయన నిరంతరం ప్రోత్సహించేవారు. కొన్ని నెలల క్రితం వరకు కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఆయన తన అనుభవంతో విశేష సేవలు అందించారు. అనారోగ్యంతో పోరాడుతున్న సమయంలోనూ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు’’ అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.నారా లోకేశ్ కూడా బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఏపీఎస్ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ అండ్ అనారోగ్యంతో పోరాడుతున్న సమయంలోనూ ఎండీ బాలసుబ్రహ్మణ్యం అమెరికాలో చికిత్స పొందుతూ కన్నుమూశారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. “నిజాయతీ, అంకితభావంతో విధులు నిర్వర్తించి ముక్కుసూటి మనిషిగా పేరుపొందిన బాలసుబ్రహ్మణ్యం గారి సేవలు చిరస్మరణీయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. పరిపాలనా నైపుణ్యం, ఆధునిక పోలీసింగ్‌కు ఆయన ఒక మూలస్తంభం వంటి వారు. ప్రజా సేవలో ఆయన చూపిన అంకితభావం, ధైర్యం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి” అని లోకేశ్ నివాళులర్పించారు.

చంద్రబాబుకు చేసిన పనులు చెప్పి ఓట్లు అడిగే దమ్ముందా?



అమరావతి:ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి(ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మీరు ఏం చేశారని ప్రజలు ఓట్లు వేస్తారంటూ చంద్రబాబు సర్కార్‌ను ప్రశ్నించారు. హౌసింగ్ కాలనీల్లో ఒక్క రూపాయి పనులైనా చేశారా?. పులివెందులకు మెడికల్ కాలేజీ వస్తే మీరే వద్దన్నారు. ఎన్నికల్లో ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఈ మూడేళ్లల్లో ఏం చేశారో చెప్పి ఓట్లు అడిగే దమ్ము చంద్రబాబుకు ఉందా అని సూటిగా ప్రశ్నించారు.‘చంద్రబాబు ఎంత బలహీనమైన ముఖ్యమంత్రో ఏపీ మొత్తానికి అర్థమైంది. వైఎస్సార్‌సీపీ కార్పొరేట్, కౌన్సిలర్ అభ్యర్థులను నామినేషన్‌లు వేయకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. మధ్యాహ్నం 1:30కు నామినేషన్లు వేసుకోవచ్చని చెప్పి పోలీసులే అడ్డుకోవడం శోచనీయమన్నారు.ఓడిపోతామనే భయంతో వైసీపీ అభ్యర్థులను టార్గెట్ చేసుకొని దాడులకు పాల్పడుతున్నారు. కనీసం ప్రచారం కూడా వైఎస్సార్‌సీపీ నేతలను ప్రశాంతంగా చేసుకోనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్రజాస్వామిక చర్యలన్నీ చేతకాని చంద్రబాబు హయాంలో జరుగుతున్నాయని, గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి దాడులు జరగలేదని గుర్తు చేశారు.కూటమి ప్రభుత్వం ఏజెంట్లను, ఓటర్లను బ్లాక్ చేసి దొంగ ఓట్లు వేసుకోవడానికి పన్నాగం పన్నారని ఆరోపించారు. టీడీపీ నీచ ప్రణాళికలకు కోయ ప్రవీణ్ పూర్తిగా సహకరిస్తున్నాడు. టీడీపీ కుట్రలను ఎస్ఈసీ దృష్టికి వైఎస్సార్‌సీపీ తీసుకెళ్లింది. ఫ్యాక్షనిజాన్ని చంద్రబాబు తల్లి లేపుతున్నాడు. చంద్రబాబు.. నీవు చేసే తప్పుడు పనులు చాలా దూరం వెళ్తాయి’ అని ఫలితం అనుభవించక తప్పదని ఎంపీ హెచ్చరించారు.

ప్రకృతి విపత్తుల్లో ప్రజలకు అండగా సీఎం చంద్రబాబు.. జగన్‌పై మంత్రి సవిత విమర్శలు!



శ్రీ సత్యసాయి, అక్టోబర్ 30:
సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తున్నారని మంత్రి సవిత అన్నారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సంక్షేమం కోసం పరితపించే నాయకుడని కొనియాడారు. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతిసారీ బాధితులకు అండగా నిలుస్తూ.. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తారని చెప్పారు.విజయవాడ వరదల సమయంలోనూ, తాజాగా ఆర్నాబ్ తుపాను సమయంలోనూ నిద్రపోకుండా ప్రజల కోసం పనిచేశారని పేర్కొన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు స్వయంగా పర్యటించి బాధితులకు భరోసా కల్పించారని.. బాధితులందరికీ న్యాయం చేస్తామని ఇప్పటికే ప్రకటించారని తెలిపారు. అయితే.. గత ప్రభుత్వ హయాంలో జగన్ వ్యవహరించిన తీరుపై మంత్రి విమర్శలు గుప్పించారు. వరద బాధితులను పరామర్శించే పేరుతో సినిమా సెట్టింగులు ఏర్పాటు చేశారని.. తుపాను సమయంలో ఐమాక్స్ థియేటర్‌లో సినిమా చూస్తూ గడిపారని ఆరోపించారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 42 మంది మరణించిన సమయంలోనూ బాధితులను పరామర్శించలేదని విమర్శించారు. ప్రజల కష్టాలు, బాధితులను ఆదుకోవడం గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని సవిత వ్యాఖ్యానించారు.

నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టలో మంత్రి నారాయణ ప్రచారం.. ప్రజల ఘన స్వాగతం



నెల్లూరు, అక్టోబర్ 30: స్థానిక ఎన్నికల ప్రచార ముగింపుకు కౌంట్‌డౌన్ మొదలవటంతో మంత్రి నారాయణ స్పీడ్ పెంచారు. సతీమణి రమాదేవి, అల్లుడు పునీత్‌తో కలిసి సర్వేపల్లి కాలువ కట్టపై ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శాశ్వత ఇంటి పట్టాలు మంజూరు చేయించిన మంత్రికి కాలువ కట్టవాసులు బ్రహ్మరథం పట్టారు. లబ్ధిదారులు రోడ్డుపై పూలపాన్పు పరిచి కృతజ్ఞతాంజలులు తెలిపారు. మంత్రి దంపతులకు మహిళలు గుమ్మడికాయ దిష్టి తీసి, మంగళ హారతులిచ్చారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 2014లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి, మంచినీటి ప్రాజెక్టుకు రూ.1100 కోట్లు నిధులు తెచ్చినట్లు చెప్పారు. రూ.940 కోట్లతో 90 శాతం పనులు చేశామని.. గత ప్రభుత్వం పదిశాతం పనులు చేయకపోవడంతో రూ.160 కోట్లు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. తమపై కోపంతో అభివృద్ధి పనులన్నీ అటకెక్కించేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే పనులన్నీ తిరిగి ప్రారంభించినట్లు చెప్పారు. భగత్ సింగ్ కాలనీ, సర్వేపల్లి కాలువ కట్ట వాసుల ఏళ్లనాటి సమస్యను పరిష్కరించామన్నారు.2600 శాశ్వత పట్టాలు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. మరో 4500 పట్టాలను సంక్రాంతి కల్లా పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ లాగా తాము నివాస ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని.. సంపూర్ణ హక్కు కల్పించే చట్టబద్ధమైన పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. వైసీపీ చేసే దుష్ప్రచారాలను నమ్మొద్దని.. చెప్పినవన్నీ చేసి చూపిస్తున్నామన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లతో పాటు, మేయర్‌గా రూప్ కుమార్‌ను ఆశీర్వదించాలని.. అభివృద్ధి కొనసాగింపుకు సహకరించాలని మంత్రి నారాయణ కోరారు.

1న పుర పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా - 36,351 మందితో బందోబస్తు



అమరావతి:వంబర్ 1న జరగనున్న వంద పట్టణ స్థానిక సంస్థల పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాష్ట్రవ్యాప్తంగా 36,351 మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తోంది. పోలీసు సిబ్బందితో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియో గ్రాఫర్ల ద్వారా నిరంతర నిఘాకు చర్యలు తీసుకుంటున్నారు.స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగం: వివిధ జిల్లాల్లో 671 పోలింగ్ కేంద్రాలను అత్యంత సున్నితమైనవిగా గుర్తించి వాటి వద్ద 3,355 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. మరో 1,233 సున్నిత కేంద్రాల కోసం మరో 4,943 మందిని సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చింది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరింది.12,244 కేంద్రాల్లో 1న పోలింగ్?: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. 12,244 కేంద్రాల్లో 1న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభవుతుంది. 1.03 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని కార్పొరేషన్లు, మున్సిపల్ కార్యాలయాలకు అధికారులు పంపించారు. వీటిని ఈనెల 31న పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలించనున్నారు.ఇదిలా ఉండగా ఎన్నికల నేపథ్యంలో నామినేషన్? వేసిన అభ్యర్థులు ప్రచారాలు ముమ్మరంగా చేస్తున్నారు. చాలా చోట్ల కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ ప్రక్రియలో వైఎస్సార్సీపీ చతికిలబడిందని రాజకీయ నిపుణులు వెల్లడిస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో స్కూల్ బస్సు బోల్తా.. డ్రైవర్, ఇద్దరు విద్యార్థులకు గాయాలు



ఎన్టీఆర్ జిల్లా, అక్టోబర్ 30:
జిల్లాలోని జి.కొండూరు మండలం పినపాక రోడ్డులో శుక్రవారం) ఉదయం ఓ స్కూల్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, ఇద్దరు విద్యార్థులకు గాయాలవగా.. మిగిలిన విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో మొత్తం 16 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. బస్సు బోల్తా పడిన వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు.. అక్కడకు చేరుకుని బస్సులో నుంచి పిల్లలను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు.గాయాలైన డ్రైవర్, విద్యార్థులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులంతా చెవుటూరు, ఆత్కూరు గ్రామాలకు చెందిన వారుగా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

‘రూ.10వేల కోట్ల వ్యాపారం ప్రమాదంలో పడుతుంది’- ‘చలో దిల్లీ’ ర్యాలీని వాయిదా వేయాలని సోనియాకు వ్యాపారుల లేఖ



దిల్లీ:నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి తలపెట్టిన ‘చలో దిల్లీ’ ర్యాలీని వాయిదా వేయాలని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ(సీటీఐ) గురువారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీకి లేఖ రాసింది. పండుగల సీజన్ వ్యాపారాలకు అత్యంత కీలకమైన సమయం కాబట్టి, ఈ సమయంలో ర్యాలీ నిర్వహించడం వల్ల తమకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మెగా ర్యాలీకి పది లక్షల మంది ప్రజలు, 15000-20000 వాహనాలు సెంట్రల్ దిల్లీలోకి రావడం వల్ల ఇరవైకు పైగా మార్కెట్లలో తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని హెచ్చరించింది. ఈ ర్యాలీ వల్ల రూ.10,000 కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు ప్రమాదంలో పడతాయని పేర్కొంది.‘మేము ఈ ర్యాలీని వ్యతిరేకించడం లేదు’‘‘నవంబర్ 1న పది లక్షల మందితో జరగబోయే మెగా ర్యాలీని దీపావళి తర్వాతి తేదీకి వాయిదా వేయాలని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని కోరుతున్నాం. ఈ ర్యాలీ వల్ల 15,000-20,000 వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల దిల్లీలో పూర్తిస్థాయి ట్రాఫిక్ జామ్ ఏర్పడవచ్చు. దిల్లీ వాణిజ్య వ్యవస్థకు ఇది చాలా కీలక (పండగల) సమయం. నవంబర్ 6న ధంతేరస్, నవంబర్ 8న దీపావళి పండగ ఉంది. అయితే నవంబరు 1న ర్యాలీ ఉండడంతో వ్యాపారుల సరకుల రవాణాకు, కొనుగోలుదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. దీంతో వ్యాపారాల యజమానులు తీవ్ర భయాందోళనలను ఎదుర్కొంటున్నారు. మా విజ్ఞప్తి రాజకీయాలకు సంబంధించినది కాదు. కేవలం మా వ్యాపార మనుగడ కోసం చేస్తున్నదే. మేము ఈ ర్యాలీని వ్యతిరేకించడం లేదు. దీపావళి పండగ సమయంలో మా జీవనోపాధిని కాపాడుకోవాలని హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాం.” అని సోనియా గాంధీకి రాసిన లేఖలో సీటీఐ (జు×) ఛైర్మన్ థర్మన్ బ్రిజేశ్ గోయల్ పేర్కొన్నారు.ఈ మార్కెట్లు దిల్లీకి ప్రాణాధారమైనవి : సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్‌దేశ రాజధానిలో ఉన్న 20 ప్రధాన మార్కెట్లు కేవలం వ్యాపార కేంద్రాలు మాత్రమే కావని, ఇవి దిల్లీ నగరానికి ప్రాణాధారమైనవని సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ స్పష్టం చేశారు. ఈ మార్కెట్లలో రోజుకు రూ.10,000-రూ.12,000 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతాయని వివరించారు. ఒకవేళ నవంబరు 1న చలో దిల్లీ ర్యాలీని ఇండియా కూటమి చేపడితే అక్టోబర్ 31, ఆ తర్వాత రోజు సెంట్రల్ దిల్లీలో లాక్‌డౌన్ వంటి పరిస్థితులు ఏర్పడి రాకపోకలు స్తంభిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధంతేరస్ పండగ కోసం సరుకులను ఎలా రవాణా చేయాలి? అని అన్నారు. తన విన్నపంలో గురువారం సాయంత్రం నుంచే దిల్లీలో రవాణా వ్యవస్థను స్తంభింపజేయగల ప్రధాన సమస్యలను పేర్కొన్నారు. రామ్‌లీలా మైదానంలో కనీసం 200 పెద్ద బస్సులను పార్క్ చేసేందుకే స్థలం లేదని, అలాంటిది 15,000-20,000 వాహనాలను ఎక్కడ పార్క్ చేస్తారు? అని ప్రశ్నించారు.“300 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ మార్కెట్లు దేశవ్యాప్తంగా వస్తువులను సరఫరా చేస్తాయి. ఇక్కడికి ప్రతిరోజూ నరేలా, బావానా, ఓఖ్లా, మాయాపురి, ముండ్కా, ఉద్యోగ్ నగర్, మంగోల్‌పురి వంటి 56 పారిశ్రామిక ప్రాంతాల నుంచి సుమారు 5వేల ట్రక్కులు, టెంపోలు వస్తుంటాయి. మాకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఇండియా కూటమి చలో దిల్లీ ర్యాలీని పండగ సీజన్ ముగిసిన తర్వాత, అంటే నవంబర్ 10 తర్వాతకు వాయిదా వేసుకోవాలి. నవంబర్ 1నే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం తప్పనిసరి అయితే, దానిని బురారీ మైదానంకు మార్చాలి.” అని బ్రిజేశ్ గోయల్ స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, నవంబర్ 1న ఇండీ కూటమి తలపెట్టిన చలో దిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం కోరారు. పోలీసులు, లాఠీలకు భయపడొద్దని సూచించారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విద్యార్థి సంఘాలన్నీ ఈ మార్చ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇదో అద్భుతమైన ర్యాలీ కాబోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

కొలువు కోసం సైగలతో దివ్యాంగుడి మొర.. 24 గంటల్లో ఉద్యోగం కల్పించిన సీఎం విజయ్



చెన్నై :తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఓ దివ్యాంగ నిరుద్యోగి పట్ల మానవతా దృక్పథంతో స్పందించారు. ఉద్యోగం ఇప్పించాలని సైగలతో వేడుకున్న యువకుడికి కేవలం 24 గంటల్లోనే ప్రభుత్వ ఉద్యోగం కల్పించి తన హామీని నిలబెట్టుకున్నారు. ఇచ్చిన మాటను వెంటనే అమలు చేసిన ఈ ఘటనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.వివరాల్లోకి వెళితే.. చెన్నై గిండిలోని ప్రభుత్వ వృత్తివిద్యా శిక్షణ సంస్థలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమానికి సీఎం విజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దినేశ్ అనే దివ్యాంగ యువకుడు సీఎంను కలిసి, తాను నిరుద్యోగినని, జీవనం కష్టంగా ఉందని సైగలతో వివరిస్తూ ఓ వినతిపత్రాన్ని అందించాడు. అతని పరిస్థితిని అర్థం చేసుకున్న విజయ్, తప్పకుండా సాయం చేస్తానని అక్కడికక్కడే భరోసా ఇచ్చారు.అనుకున్నదే తడవుగా, మరుసటి రోజైన గురువారం ఉదయం దినేశ్‌ను సచివాలయానికి పిలిపించారు. అక్కడ సీఎం విజయ్ స్వయంగా దినేశ్‌తో కరచాలనం చేసి, ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. తిరువొత్తియూరులోని ప్రభుత్వ శిక్షణ కేంద్రంలో సహాయకుడి పోస్టును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.విజ్ఞప్తి చేసిన ఒక్క రోజులోనే ఉద్యోగం రావడంతో దినేశ్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన కష్టాన్ని అర్థం చేసుకుని తక్షణమే స్పందించిన సీఎం విజయ్‌కు అతడు కృతజ్ఞతలు తెలిపాడు. ప్రజాప్రతినిధులు సమస్యలపై వెంటనే ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలిచింది.

అలాంటి శారీరక సంబంధం అత్యాచారం కాదు: సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ, అక్టోబర్ 30: పరస్పర అంగీకారంతో కొనసాగిన శారీరక సంబంధాన్ని బంధం విఫలమైన తర్వాత అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రేమ సంబంధం లేదా వివాహ బంధం కొనసాగిన సమయంలో ఇరువురి అంగీకారం తో జరిగిన శారీరక సాన్నిహిత్యాన్ని అత్యాచారంగా పేర్కొనలేమని తేల్చి చెప్పింది. బంధం ముగిసిందన్న కారణంతో దానిని నేరంగా మార్చడం సరికాదని అభిప్రాయపడింది. ఈ మేరకు జస్టిన్ బి.వి.నాగరత్న, జస్టిన్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కీలక తీర్పునిచ్చింది. కేరళకు చెందిన సంతోశ్ కుమార్ అనే వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం కేసు నుంచి అతనికి విముక్తి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది.విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇరువురి మధ్య బంధం సజావుగా కొనసాగుతున్న సమయంలో జరిగిన శారీరక సాన్నిహిత్యాన్ని, ఆ బంధం ముగిసిన తర్వాత అత్యాచారంగా చిత్రీకరించడం చట్టపరంగా సమర్థనీయం కాదని పేర్కొంది. కేవలం సంబంధం విఫలమైందనే కారణంతో గతంలో ఇచ్చిన అంగీకారాన్ని నేరంగా పరిగణించలేమని తెలిపింది. వంటి అంశాలు ఉంటే వాటిని ంగా పరిగణించాల్సిందేనని స్పష్టం చేసింది. సంబంధాలు విఫలమైన ప్రతిసారీ క్రిమినల్ కేసులు నమోదు చేయడం వల్ల అత్యాచారం వంటి తీవ్రమైన నేరాల ప్రాధాన్యం తగ్గే ప్రమాదం ఉందని ధర్మాసనం హెచ్చరించింది. ఈ తీర్పు ద్వారా పరస్పర అంగీకార సంబంధాలు, లైంగిక నేరాల మధ్య స్పష్టమైన గుర్తించాలని సుప్రీంకోర్టు సూచించింది.

కాంగ్రెస్ బ్యాంకులను ఏర్పాటు చేస్తే మోదీ ప్రభుత్వం వాటిని అమ్మేస్తోంది



దిల్లీ: ఐడీబీఐ బ్యాంక్‌లో మెజారిటీ వాటాను విక్రయించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో దేశ పారిశ్రామిక అభివృద్ధి కోసం బ్యాంకులను ఏర్పాటు చేస్తే, ప్రస్తుత మోదీ ప్రభుత్వం వాటిని అమ్మేస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్? వేదికగా స్పందించిన ఆయన, బ్యాంకు ఉద్యోగులకు తన మద్దతును ప్రకటించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ విషయంలో కాంగ్రెస్- బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాల విధానాల వ్యత్యాసాలను వివరించారు. “కాంగ్రెస్ హయాంలో దేశ పారిశ్రామిక రంగాన్ని నిర్మించేందుకు ఐడీబీఐని స్థాపించారు. మోదీ హయాంలో ముందుగా బిడ్డింగ్ ప్రక్రియ చేపట్టి, ఆపై ధరను నిర్ణయించారు. కాంగ్రెస్ హయాంలో బ్యాంకులను సృష్టించారు. కానీ మోదీ హయాంలో అవి అమ్ముడవుతున్నాయి. ఐడీబీఐ బ్యాంక్ ఉద్యోగులకు నేను పూర్తి మద్దతుగా ఉంటాను.”బ్యాంక్ ప్రైవేటీకరణ వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రిజర్వేషన్లు కోల్పోతారు: రాహుల్ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగుల సేవా నిబంధనలు బలహీనపడతాయని ఐడీబీఐ ఉద్యోగులకు రాసిన లేఖలో రాహుల్ గాంధీ పేర్కొన్నారు. “బ్యాంక్ కుటుంబ సభ్యులారా గత ఏడాది మార్చిలో మీలో కొందరు పార్లమెంటు భవనంలో నన్ను కలిశారు. మీరు నన్ను ఒక సింపుల్? ప్రశ్న అడిగారు. మీరు లాభాల్లోకి తెచ్చిన బ్యాంకును ప్రభుత్వం ఎందుకు విక్రయిస్తోంది? నేను ఈ ప్రశ్నను లోక్‌సభలో లేవనెత్తాను. లాభాల్లో ఉన్న ప్రభుత్వ బ్యాంకును ఎందుకు అమ్ముతున్నారని, అలాగే అందులో పనిచేసే ఉద్యోగులకు, డిపాజిటర్లకు రక్షణ ఎలా కల్పిస్తారని ప్రశ్నించాను. దీనికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం లేదు. ఇప్పుడు ×ణదీ× బ్యాంకును కెనడాకు చెందిన ‘ఫెయిర్‌ఫాక్స్’ అనే సంస్థకు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ×ణదీ× బ్యాంకు ప్రైవేట్ యాజమాన్యంలోకి వెళ్తే రాజ, సా, రాదీజ అభ్యర్థులకు కల్పించే రిజర్వేషన్లు కూడా రద్దవుతాయి. ఇప్పటికే బలహీనపడిన మీ సేవా నిబంధనలకు ఉన్న చివరి రక్షణ కూడా పోతుంది. ప్రైవేట్ రంగంతో పాటు బలమైన ప్రభుత్వ రంగం కూడా ఉండాలని కాంగ్రెస్ ఎప్పుడూ నమ్ముతుంది. ప్రభుత్వ బ్యాంకులు అనేవి అమ్ముకోవాల్సిన ఆస్తులు కావు, అవి దేశ నిర్మాణానికి ఉపయోగపడే సాధనాలు.” అని రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారు.అక్టోబర్ 14న కేంద్ర మంత్రివర్గం ×ణదీ× బ్యాంకులో 60.72 శాతం వాటాను (నియంత్రణ హక్కులతో సహా) కెనడాకు చెందిన ‘ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్’ అనుబంధ సంస్థకు విక్రయించేందుకు ఆమోదం తెలిపింది.వేలంలో రిజర్వ్ ధరను తగ్గించడం కానీ, పెంచడం కానీ చేయలేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే, సవరించిన ప్రక్రియ ద్వారా డిస్కవర్డ్ బిడ్ ధరను రూ. 3,917 కోట్లు పెంచడానికి సహాయపడిందని మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. అయితే, బ్యాంక్ ప్రైవేటీకరణతో ఉద్యోగుల్లో రిజర్వేషన్లు, పెన్షన్ ప్రయోజనాలు, సేవా నిబంధనల రక్షణపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ వివరణ ఇచ్చింది.

కూలిన హెలికాప్టర్- బద్రీనాథ్ నుంచి దేహ్రాదూన్‌కు వెళ్తుండగా ఘటన



ఉత్తరాఖండ్:ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో ఒక ప్రైవేట్ హెలికాప్టర్ కూలిపోయింది. బద్రీనాథ్ నుంచి దేహ్రాదూన్ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసులు, ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. హెలికాప్టర్‌లో పైలెట్, ఐదుగురు ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ లోని ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు.ఉత్తరాఖండ్ విపత్తు నిర్వహణ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2:20 గంటల సమయంలో చమోలి జిల్లా జోషీమఠ్ పరిధిలోని ‘చాయ్’ గ్రామ సమీపంలోకి రాగానే హెలికాప్టర్ కమ్యూనికేషన్‌ను కోల్పోయింది. అనంతరం ట్రాకింగ్ సిస్టమ్‌కు సమాచారం రావడం ఆగిపోయింది. జేపీ పవర్ హౌస్ సమీపంలో ఉన్న ఒక కొండను బలంగా ఢీకొట్టి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎంతమంది చనిపోయారనే విషయంపై ఇంకా స్పష్టత లేదని చెప్పారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ బద్రీనాథ్ ఆలయ దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందా? అనేది ఇంకా నిర్ధరణ కావాల్సి ఉందన్నారు. హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయిన తరువాత, ఘటన జరిగిన ప్రాంతంలో పొగలు పైకి లెచినట్లు అధికారులు గుర్తించారు.హెలికాప్టర్ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. రెస్క్యూ ఆపరేషన్ల కోసం పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ, ఐటీబీపీ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటనా ప్రాంతంలో హెలికాప్టర్?ను రంగంలోకి దింపినట్లు చెప్పారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ‘ట్రాన్స్ భారత్ ఏవియేషన్’ అనే ప్రైవేట్ సంస్థకు చెందినదిగా జిల్లా యంత్రాంగం గుర్తించింది.పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తున్న ఉత్తరాఖండ్ సీఎంహెలికాప్టర్? ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. పరిస్థితిని తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, అధికారులతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులను హెలికాప్టర్లలో ఆసుపత్రికి తరలించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్?లో పోస్టు పెట్టారు. ‘జోషిమఠ్? సమీపంలోని చాయ్ గ్రామం వద్ద హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది.సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. ప్రయాణికులందరూ క్షేమంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నా’ అని ఆయన ఎక్స్? పోస్టులో రాసుకొచ్చారు.మరోవైపు, హెలికాప్టర్‌లో ఉన్న ప్రయాణికుల వివరాలను అధికారులు వెల్లడించారు. పైలట్ హిమాంశుగా గుర్తించగా, ప్రయాణికులు ప్రతాప, అరుణ్, శంకర్ గౌడ, సుధీర్, నటరాజ ఐదుగురు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రయాణికుల్లో ఒకరైన అరుణ్ బెంగళూరు పోలీస్ క్రైమ్ బ్రాంచ్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఇతర ప్రయాణికుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బహిరంగ అభిశంసన వాయిదా



న్యూఢిల్లీ, అక్టోబర్ 30కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ‘బహిరంగ అభిశంసన’ కార్యక్రమం రేపటికి వాయిదా పడింది. నేడు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధికారిక నివాసంలో మధ్యాహ్నం 3.30 గంటలకు మాక్ పార్లమెంటు నిర్వహించాలని కాంగ్రెస్ భావించింది. అయితే, నేడు రాజధానిలో ఆగకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్రువీకరించారు. ‘బహిరంగ అభిశంసన కార్యక్రమాన్ని రేపు సాయంత్రం 4 గంటలకు నిర్వహించేందుకు నిర్ణయించాము’ అని చెప్పారు.జాతీయ మీడియా కథనాల ప్రకారం, మాక్ పార్లమెంటుకు మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ సారథ్యం వహించనున్నారు. మాక్ పార్లమెంటులో అభిశంసన తీర్మానాన్ని ఖర్గే ప్రవేశపెడితే ఎంపీ రాహుల్ గాంధీ ముగింపు ఉపన్యాసం ఇవ్వనున్నారు. జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్‌తో పాటు సీనియర్ నేతలు మీరా కుమార్, టీఎంసీ నేత డెరెక్ ఓ బ్రయన్, సమాజ్‌వాదీ పార్టీ నేత హరేంద్ర మలిక్, జేఎంఎం నేత మహువా, సీపీఐ నేత జాన్ బ్రిట్టాస్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ విదేశీ పర్యటనలు దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే




దిల్లీ:కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. తన విదేశీ పర్యటనల ద్వారా భారతదేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీన పరిచేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి, మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు మనవడు ఎన్వీ సుభాష్ ఆరోపించారు. నేడు ఆయన మాట్లాడుతూ.. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.“రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లిన ప్పుడల్లా, ఆయన చుట్టూ ఉన్న ఎకోసిస్టమ్‌లో ఏదో మార్పు వస్తుంది. ప్రతిపక్ష నేతగా ఆయన నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు, కానీ దానికి బదులుగా రాజ్యాంగం, ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ వంటి వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఏదో ఒకరోజు వారు మీడియాపై కూడా వ్యాఖ్యలు చేస్తారు. ఆయన విదేశాలకు వెళ్లి ఇక్కడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు” అని సుభాష్ అన్నారు.బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేత దేశంలోనే ఉండి, పార్టీ కార్యకర్తలతో, ప్రజలతో మమేకం కావాలని ఆయన సూచించారు. “విదేశాల నుంచి తిరిగి వచ్చాక, ఏమాత్రం సంబంధం లేని విషయాలు మాట్లాడుతూ కొన్ని వర్గాల ప్రజలను రెచ్చగొడుతున్నారు. రాబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఆయన ఓటముల సెంచరీ కొట్టడం ఖాయం” అని ఎద్దేవా చేశారు.

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్



దిల్లీ:ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు.బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్?లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ ‘సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా’పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు.ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు.2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

సంపాదకీయం



ఓటు హక్కుకోసం పోరాటం

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల భవిష్యత్తును నిర్ణయించేది ప్రజలే. ఆ నిర్ణయానికి ప్రాతిపదిక ఓటు హక్కు. కానీ ఓటు వేయాలనే ఆసక్తి ఉన్నా, ఓటర్ల జాబితాలో పేరే లేకపోతే పౌరుడి గొంతుకకు విలువ ఉండదు. ఓటు హక్కు కల్పించడంతో పాటు, దాన్ని వినియోగించుకునే అవకాశం ప్రతి అర్హుడికీ ఉందని నిర్ధారించడం కూడా ఎన్నికల వ్యవస్థ బాధ్యత. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తలెత్తుతున్న వివాదాల నేపథ్యంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో నవంబర్ 1న న్యూఢిల్లీలో 'ఓట్ బచావో-దేశ్ బచావో' ర్యాలీ నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాలను ఎప్పటికప్పుడు సరిచేయడం అవసరమే. మరణించినవారి పేర్లు కొనసాగకుండా చూడటం, నకిలీ ఓట్ల నమోదులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లను తొలగించడం ఎన్నికల సంఘం విధుల్లో భాగం.అయితే ఈ క్రమంలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. సవరణ ప్రక్రియలో తప్పులు జరిగితే వాటి ప్రభావం కేవలం ఒక వ్యక్తిపైనే కాదు. ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యంపైనా పడుతుంది. అందువల్ల ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్ని పేర్లు తొలగించారన్న లెక్కతో కాకుండా, అనర్హుల పేర్లను సరిగా గుర్తించడంతోపాటు అర్హులందరి ఓటు హక్కును ఎంత సమర్థంగా కాపాడారన్న ప్రమాణంతో అంచనా వేయాలి. దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన గణాంకాల ప్రకారం, వివిధ దశల్లో ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి సుమారు 13.37 కోట్ల పేర్లు తొలగించబడ్డాయి. పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించినప్పుడు ప్రతి కేసునూ ఎలా పరిశీలించారు? ఓటరు అందుబాటులో లేకపోతే మరోసారి సంప్రదించారా? అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇచ్చారా? పేర్లు తొలగించిన కారణాలను వ్యక్తిగతంగా తెలియజేశారా?అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. గణాంకాలు వెల్లడించడం మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉన్న ప్రక్రియను కూడా ఎన్నికల సంఘం ప్రజలకు వివరిస్తేనే ప్రజలకు భరోసా కలుగుతుంది. అయితే దురదృష్టవశాత్తు సర్ ప్రక్రియలో పారదర్శకతో లోపిస్తుంది. మరోవైపు 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలనే నిబంధనతో ప్రజల్లో అనుమానాలు రెట్టింపవుతున్నాయి.తెలంగాణలో ఓటర్ల జాబితాల సవరణపై పలు సందేహాలున్నాయి. రాష్ట్రంలో గతంలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, 2,64,87,213 మంది నుంచి గణన పత్రాలు అందినట్లు ఎన్నికల సంఘం పేర్కొనడంతో 73,39,235 మంది పేర్లు ముసాయిదా జాబితాలో లేకుండా పోయినట్లు లెక్కలు సూచిస్తున్నాయి.మరోవైపు సుమారు 92,87,577 మందికి అనుమానాస్పదం కింద నోటీసులు జారీ చేశారు. వీరందరి కోసం తెలంగాణ కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో బిఎల్ఎలను నియమించి వారి ఓటు హక్కును పరిరక్షించేందుకు కృషి చేసింది. దేశ వ్యాప్తంగా తొలగించిన ఓట్ల గణాంకాలను పరిశీలిస్తే కీలకమైన అంశాలు వెలుగుచూస్తున్నాయి.గత జాబితాతో వివరాలు సరిపోలకపోవడం ప్రస్తుత ఓటరు అర్హత లేదని నిర్ధారించడానికి సరిపోతుందా? దశాబ్దాలుగా ఓటు వేస్తున్న వ్యక్తి పూర్వీకుల వివరాలు లేదా పాత చిరునామాను సమర్పించలేకపోతే అతడి హక్కు ప్రశ్నార్థకమవ్వాలా? సందేహాలపై ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. చిరునామా మారినవారు, తాత్కాలికంగా అందుబాటులో లేనివారు, వత్రాలు సేకరించలేని వృద్ధులు, పేదలు ఎదుర్కొనే ఇబ్బందులను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ (ఎఫ్ఆర్సి)ను ప్రత్యామ్నాయ ఆధారంగా పరిగణించాలని కోరినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. గతంలో ఓటు వేసిన వారి పేర్లు కూడా తొలగించారు. ఇప్పుడు వారు ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం వివరాలు సమర్పించాల్సి రావడం ఎంత వరకు సమంజసం.ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో ఉపయోగించే ఫారం-6, ఫారం-7, ఫారం-8ల విషయంలోనూ స్పష్టత కరువైంది. కొత్త ఓటరు నమోదుకు ఫారం- 6, పేరు తొలగింపుకు సంబంధించిన అభ్యర్థనకు ఫారం-7, వివరాల సవరణలకు ఫారం-8 ఉపయోగిస్తారు. వీటిలో డిక్లరేషన్‌కు సంబంధించిన మార్పులు, వాటి చట్టపరమైన ఆధారాలు, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చోటుచేసుకున్న మార్పులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. ప్రధానంగా ఫారం-6లో డిక్లరేషన్‌కు సంబంధించి నిబంధనలకు వ్యతిరేకంగా మార్పులు చేశారనే అంశంపై పెద్ద దుమారమే రేగింది. ఫారం-6లో మార్పుకు తాము అనుమతివ్వలేదని ఇప్పటికే ఉన్నత న్యాయస్థానం కూడా వ్యాఖ్యానించింది. ఫారం-7 ద్వారా ఓట్ల తొలగింపులో కూడా అక్రమాలు జరుగుతున్నాయనే కాంగ్రెస్ ఆరోపణలు తెలంగాణలో నిరూపితమైంది.హైదరాబాద్‌లో బిజెపికి చెందిన బిఎల్ఎ ఫారం-7 ద్వారా వారి వ్యతిరేక ఓట్ల తొలగింపుకు ప్రయత్నిస్తున్నప్పుడు కేసు నమోదైంది. దేశంలో ఓటు చోరీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రుజువులతో సహా నిరూపించారు. అదే తరహాలో ఇప్పుడు సిఇసి జ్ఞానేశ్ కుమార్‌తో మరో ఇద్దరు కమిషనర్లు పలు అంశాలపై విభేదించడంతో ఎన్నికల సంఘంలో అవకతవకలపై అనుమానాలు రెట్టింపవడమే కాకుండా దీర్ఘకాలికంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు నిజమని తేలాయి. ప్రజాస్వామ్యానికి కీలకమైన ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుండడంతో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీనియర్ నేత ప్రియాంక గాంధీ నేతృత్వంలో పార్టీ చేపట్టిన నిరసనలకు ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నుండి భారీ స్పందన రావడంతో బిజెపి ప్రభుత్వం అణిచేయాలని ప్రయత్నిస్తుంది. స్వయం ప్రతిపత్తిగల ఎన్నికల సంఘాన్ని మోడీ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా భ్రష్టుపట్టిస్తోంది. డిసెంబర్ 2023లో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలో బిజెపి ప్రభుత్వం మార్పులు చేస్తూ నియామక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఆయన స్థానంలో కేంద్ర కేబినెట్ మంత్రికి చోటు కల్పించింది. అనంతరం 2024లో జ్ఞానేశ్ కుమార్‌ను సిఇసిగా నియమించి సర్‌తో సహా పలు వివాదాస్పద నిర్ణయాలకు ఆజ్యం పోసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘాన్ని సంస్కరించాలని, సిఇసి తక్షణమే రాజీనామా చేయాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లతో నవంబర్ 1న ఢిల్లీలో 'ఓట్ బచావో -దేశ్ బచావో' ర్యాలీ నిర్వహించేందుకు పిలుపిచ్చింది. ఈ పోరాటంలో ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన, కార్మిక, రైతు సంఘాలు కూడా భాగస్వామ్యం అయితే మోడీ ప్రభుత్వం మెడ వంచక తప్పదు.

నెతన్యాహు నెగ్గితే భద్రత ఎవరికి?

అక్టోబర్ 27న ఇజ్రాయెల్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రధాన కేంద్ర బిందువుగా మారారు. ఇజ్రాయెల్ ఏర్పడిన 78 సంవత్సరాల చరిత్రలో దాదాపు రెండు దశాబ్దాల పాటు అధికారంలో కొనసాగిన నెతన్యాహుకు ఈ ఎన్నికలు అతిపెద్ద పరీక్షగా నిలిచాయి. 2021లో అధికారం కోల్పోయినప్పటికీ, 2022లో విజయం సాధించి తీవ్ర భావజాలం వైపు మొగ్గు చూపారు. అల్ట్రా ఆర్థడాక్స్ పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలపై సుప్రీంకోర్టు నియంత్రణ తగ్గించగలిగారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయగా, గాజాలో నెతన్యాహు నాయకత్వంలో భీకర సమరం సాగింది. ఇదో మారణహోమం అన్న తీవ్ర విమర్శలు వచ్చాయి.మరోవైపు ప్రతిపక్ష పార్టీలు అక్టోబర్ 7న హమాస్ దాడి ఇజ్రాయెల్ భద్రతా వైఫల్యమేనని, దీనికి నెతన్యాహును బాధ్యుడిగా నిలబెడతామని, నిరంతరం సాగుతున్న యుద్ధాలకు ముగింపు పలుకుతామని వెల్లడించాయి. ఈ ఎన్నికలు నెతన్యాహును అధికారం లోంచి తొలగించడానికి విపక్షాలకు ఒక అవకాశంగా మారాయి. అయితే ఈ ఎన్నికల ఫలితాలు మిశ్రమ సంకేతాలను అందించాయి. బుధవారం సాయంత్రం పోలైన ఓట్లలో 86 శాతం లెక్కించగా 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో నెతన్యాహు నేతృత్వం లోని లికుడ్ కూటమికి 54 సీట్లు, ప్రత్యర్థి ఐజెన్‌కాట్ నేతృత్వం లోని కూటమికి 47 సీట్లు వచ్చే అవకాశం కనిపించింది. అరబ్ పార్టీలు కూడా 19 సీట్ల వరకు సాధించే అవకాశం ఉంది.ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలిపి 67 స్థానాలను సాధించే దిశగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంత సులభం కాదు.ఎందుకంటే అరబ్ పార్టీల మద్దతును స్వీకరించడానికి కొన్ని యూదు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన కూటమి చర్చలను విశాల దృక్పథంతో, ముందస్తు అభిప్రాయాలు లేకుండా జరపాలని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జాగ్ విజ్ఞప్తి చేసినా రాజకీయ పార్టీల మధ్య నమ్మకం లోపించింది. చివరి



ఫలితాల తరువాత సీట్ల పంపకం కొనసాగితే స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు రానున్న కొన్ని రోజుల వరకు పార్టీల మధ్య తీవ్ర చర్చలు, సంప్రదింపులు, ఒప్పందాల ప్రయత్నాలు జరుగుతాయి. అంతవరకు ప్రస్తుత ప్రధాన మంత్రి నెతన్యాహుయే తాత్కాలిక ప్రధాన మంత్రిగా కొనసాగుతారు. ఈ పరిస్థితి ఆయనకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికలు ప్రధానంగా నెతన్యాహుపై ప్రజల అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ఒక రిఫరెండమ్ లాంటిది.ఒకప్పుడు ఇజ్రాయెల్‌లో బలమైన వామపక్ష ఉద్యమం ఉండేది. కానీ నేడు అక్కడి రాజకీయాలు ప్రధానంగా మతపరమైన జియోనిజం, దాని వివిధ రూపాల ఆధిపత్యంలో ఉన్నాయి. నెతన్యాహును వ్యతిరేకించే కూటమి కూడా అరబ్ రాజకీయ పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయబోమని హామీ ఇవ్వడం గమనార్హం. నెతన్యాహు తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసే ఓటును ఇజ్రాయెల్ శత్రువులకు మద్దతుగా చిత్రీకరించడం ద్వారా ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పడేశారు. ఇజ్రాయెల్‌ను రక్షించడానికి తన యుద్ధాలు ధైర్యవంతమైన, తప్పనిసరి చర్యలని నెతన్యాహు చెప్పుకొచ్చారు. ఇజ్రాయెల్ భద్రతపై ప్రజల్లో ఉన్న ఆందోళనలను తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. ఇజ్రాయెల్ జనాభాలో దాదాపు 20 శాతంగా ఉన్న అరబ్ ప్రజలు అరబ్ రాజకీయ పార్టీల వెనుక ఏకమవ్వడం ఈ విభజనను ప్రతిబింబిస్తోంది.ఇజ్రాయెల్ యూదులు, అరబ్ పౌరుల మధ్య రాజకీయ విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌లో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్న వాస్తవాన్ని ఈ ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. బెంజమిన్ నెతన్యాహు అధికారంలో కొనసాగుతున్నంత కాలం ఇరాన్‌పై యుద్ధమే కాదు, ఇజ్రాయెల్‌కే కాకుండా మొత్తం మధ్య ప్రాచ్య ప్రాంతానికే నష్టం కలగక తప్పదు. ట్రంప్ కూడా నెతన్యాహుకు మద్దతు తెలుపుతూ ఇరాన్‌పై మొదలు పెట్టిన సైనిక చర్యను చివరివరకు కొనసాగించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ తన సవాళ్లను అధిగమించి తన రాజకీయ స్థితిని నిలబెట్టుకుంటే పశ్చిమాసియా మరోసారి భగ్గుమనక తప్పదు. అయినాసరే ప్రభుత్వ పాలనలో అరబ్ పార్టీల భాగస్వామ్యాన్ని అన్ని వర్గాలు విస్తృతంగా ఆమోదించినప్పుడే నెతన్యాహు ప్రభుత్వానికి స్వస్తి పలకడం జరుగుతుంది.అరబ్ పార్టీలు కీలకంగా మారితే వాటితో కలిసి పనిచేయడానికి నెతన్యాహు వ్యతిరేక కూటమి అంగీకరిస్తుందా అనేది అసలు ప్రశ్న.ఈ ఎన్నికల ఫలితాల నుంచి ప్రతిపక్ష పార్టీలు పాఠం నేర్చుకుని అరబ్ పార్టీలతో కలిసి విస్తృత కూటమిని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేసేలా చూడాలి. నెతన్యాహు నియంత్రణ లోని సైనిక చర్యలను తిరిగి పరిశీలించాలి. అలాగే ప్రపంచ దేశాలతో ఇజ్రాయెల్ సంబంధాలను తిరిగి మెరుగపరిచే ప్రయత్నాలు సాగించాలి. ఇదే సమయంలో మధ్యప్రాచ్య ప్రాంతంలో పరిస్థితులు కూడా మారుతున్నాయి. సోమవారం టెహ్రాన్‌లో ఇరాన్ నాయకులు, సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్తాన్ లకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఇజ్రాయెల్, అమెరికా కారణంగా తాము ఎదుర్కొంటున్న సంఘర్షణలకు దౌత్యపరమైన పరిష్కారం కనుగొనాలనే వారి ప్రయత్నం కనిపించింది. తమ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఈ పరిణామాలు ఇజ్రాయెల్ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో పరిశీలించాల్సిందే.

విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్యం నిషేధమా?

వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న సుమారు 24వేల మంది విద్యార్థులకు పైగా చదువుకుంటున్న ఢిల్లీలోని ప్రముఖ కేంద్రీయ విశ్వవిద్యాలయం జామియా మిలియా ఇస్లామియా గత కొంత కాలంగా ఒక యుద్ధభూమిని తలపింప చేస్తుంది. క్యాంపస్‌లోకి ప్రవేశించే ప్రధాన గేట్లను కొన్నిటిని వెల్డింగ్‌చేసి, అడ్డంగా రేకులు, గోడలు మరీ కట్టి యాజమాన్యం మూసి వేసింది. దగ్గరిలోని మెట్రో స్టేషన్‌లో, క్యాంపస్ బయట దాదాపు వెయ్యి నుండి రెండువేల మందికిపైగా పోలీసు, పారా మిలిటరీ, ఐటిబిపి బలగాలు విద్యార్థులను వారు చదువుకుంటున్న విద్యాలయంలోకి అడుగుపెట్టకుండా, లోన ఉన్నవారు బయటకు పోకుండా అడ్డుకుంటున్నారు. చుట్టూ రోడ్లపై బ్యారికేడ్లు అడ్డంగా పెట్టారు. క్యాంపస్‌లో ఆస్తులకు, శాంతిభద్రతలకు, అకడమిక్ విధులకు భంగం కలుగజేస్తున్నారని విద్యార్థులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని యాజమాన్యం బెదిరిస్తూ ఉంది. 163 సెక్షన్ జామియా యూనివర్శిటీ పరిసరాల్లో విధించారు. ఆ ప్రాంతం ఒక పోలీసు క్యాంపులా వుంది.అక్టోబర్ 12వ తేదీ నుండి విద్యార్థులు తమ డిమాండ్ల సాధనకోసం నిరాహార దీక్ష చేస్తున్నారు. నేటికి 19వ రోజుకు చేరుకున్నది ఈ దీక్ష. అక్టోబర్ 17 తెల్లవారుజామున, క్యాంపస్ సెక్యూరిటీ, పోలీసులు కలిసి ఆ ప్రాంతంలో లైట్లు ఆపేసి, నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థుల్ని బయటకు లాక్కు వచ్చి కిందపడేసి కొట్టారు. మహిళా విద్యార్థినులను అనుచితంగా తాకారు. కొందరిని అరెస్టు చేశారు. మరో పక్క సంప్రదింపులు అంటూ ఒత్తిడిచేసి, ఆ తెల్లవారుజామున ఓ ఇద్దరు విద్యార్థులతో ఒక ఒప్పందంపై సంతకాలు పెట్టించి, విద్యార్థులు నిరసన ముగించారని, యాజమాన్యం ప్రకటించింది. కాగా ఇది ఒక కుటిల చర్య, విద్యార్థులను హడావిడి, గందరగోళ పెట్టి, ఒత్తిడిచేసి ఇద్దరితో సంతకాలు చేయించారు అని అంటూ, ఈ ఒప్పందాన్ని మిగిలిన వాళ్ళు తిరస్కరించారు. కొందరు దీక్ష విరమించినా, ఎబిన్ బాసిల్, రెహాన్ ఖాన్ మొదలైనవారు కొనసాగిస్తున్నారు. వీరికి జతగా కొత్తగా మరికొందరు కూడా దీక్షలో చేరారు.ఇప్పుడు లైబ్రరీలను, హాస్టళ్లను, చివరికి మరుగుదొడ్లను సైతం మూసివేశారు. విద్యార్థులను ఎలాగైనా క్యాంపస్‌నుండి ఖాళీ చేయించడం కోసం విద్యుత్తు, మంచినీటి సౌకర్యాన్ని రద్దు చేశారు. క్యాంటిన్, మెస్‌లను కూడా మూసివేశారు. లోపల ఉన్న విద్యార్థులకు బయటినుంచి ఎవరైనా, నీరు ఆహారం పంపడానికి ప్రయత్నించినా లేదా దీక్షలో ఉన్న విద్యార్థులకు చేయాల్సిన వైద్య పరీక్షలను అందించే ప్రయత్నం చేసినా అడ్డుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య యూనివర్శిటీలో ఆవరించిన ఆ చిమ్మచీకటిలో, అర్ధరాత్రి సమయాల్లో కూడా విద్యార్థులు, ముఖ్యంగా అమ్మాయిలు తమ నిరసన కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు విద్యార్థులు చేస్తున్న ఈ నిరాహార దీక్షలకు, ఆందోళనలకు ఎంతో పూర్వ చరిత్ర ఉంది.జామియా మిలియా ఇస్లామియాలో 2005లో చివరి ఎన్నికలు జరిగాయి. 2006 మార్చిలో ఎంపికైన బాడీని రద్దు చేశారు. యాజమాన్యం డిపార్ట్మెంటల్ నబ్జెక్ట్ అసోసియేషన్లు, క్లాస్ రెప్రజెంటేటివ్‌ల ద్వారా విద్యార్థుల సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కారం



చేసుకునేందుకు అడగాలని నిర్దేశించడం మొదలుపెట్టింది. ఢిల్లీ యూనివర్శిటీలో, జెఎన్‌యులో ఎన్నికలు జరుగుతుండగా మా కాలేజీలో ఎందుకు ఎన్నికల నిషేధించారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. జామియా మిలియా ఇస్లామియా స్టూడెంట్ యూనియన్ (జెఎంఐఎస్‌యు) పునరుద్ధరించాలి. 2026-27 ఎన్నికల షెడ్యూల్ తక్షణమే ప్రకటించాలి. కొత్త యూనియన్ కాన్స్టిట్యూషన్ ఖచ్చితమైన సమయ పరిధిలో ఏర్పాటు చేసి, ఆ వెను వెంటనే, 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలి.నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై విధించిన నస్పెన్షన్, రెస్టిగేషన్లు, షోకాజ్ నోటీసులు ఉపసంహరించాలి అనే ఈ ప్రధాన డిమాండ్లతోపాటు, హాస్టల్‌లో తాగునీరు, మెస్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు మెరుగుపరచాలని, లైబ్రరీ, ఫీజులు, అడ్మిషన్లు భద్రత వంటి అంశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు అడుగుతున్న మరి కొన్ని డిమాండ్లు. బ్రిటిష్ వారు మన దేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో, 1920 అక్టోబర్ 29 న ఉత్తర(ప్రదేశ్‌లోని అలీఘడ్‌లో జాతీయవాద ముస్లిం నాయకులు దీనిని స్థాపించారు. బ్రిటిష్ విద్యా వ్యవస్థకు వ్యతిరేకంగా, స్వతంత్ర, జాతీయ భావాలతో, ఆధునిక విలువలతో పనిచేసే విద్యా సంస్థగా తీర్చిదిద్దేందుకు, జామియా మిలియా విద్యా సంస్థలను వారు ఏర్పాటు చేశారు. 1925లో అలీఘడ్ నుంచి ఈ యూనివర్శిటీ ఢిల్లీ కరోల్ బాగ్‌కు, ఆ తరువాత కొంతకాలానికి ప్రస్తుతం ఉన్న ఓఖ్లా, జామియా నగర్ క్యాంపస్‌కి మారింది. దేశంలో ప్రథమ స్థానాల్లో ఉండే యూనివర్శిటీలలో ఒకటిగా ఎంతో గుర్తింపు పొందింది. జాతీయ సమైక్యత, సెక్యులర్ విద్య, ముస్లిం మైనారిటీలకు ప్రాధాన్యత, మహిళా విద్యార్థులకు మరిన్ని ఎక్కువ అవకాశాలు కల్పించడం వంటి విలువల్ని అది మొదటి నుండి పాటిస్తూ వచ్చింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ యూనివర్శిటీని 'భారతదేశంలోని అత్యంత ప్రగతిశీల విద్యా సంస్థలలో ఒకటి' అని ప్రశంసించాడు. ఒక దశలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సంస్థను బతికించడం కోసం జామియా విద్యాసంస్థ నడవాలి. డబ్బు సమస్య ఉంటే నేను భిక్ష పాత్ర పట్టుకుని తిరుగుతాను' అని మహాత్మా గాంధీ అన్నారని చెబుతారు. గాంధీజీ ఎప్పుడూ చెబుతూ ఉండే నయీ తాలీం 'పద్ధతుల్ని ప్రయోగాత్మకంగా జామియాలో అమలు చేశారు. అంతటా ఎంతో హింస చెలరేగిన, దేశ విభజన జరిగిన కాలంలో కూడా జామియా క్యాంపస్‌ను 'శాంతి ఒయాసిస్సూ' అని గాంధీజీ అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ జామియా మిలియా ఇస్లామియా కాలేజీలో అనేక సంవత్సరాల పాటు ప్రొఫెసర్‌గా, ఛాన్సలర్ కూడా పనిచేశారు. అనేక మంది ప్రముఖులు చదువుకున్న ఈ కాలేజీ, ఎంతో చరిత్ర ఉన్న ఈ క్యాంపస్ ఇప్పుడు, ఒక జైలుగా, పోలీసు క్యాంపుగా మారింది అని విద్యార్థులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇతర విద్యార్థి సంఘాలు, అనేక యూనివర్శిటీల విద్యార్థులు కూడా జామియా మిలియా ఇస్లామియా విద్యార్థులకు మద్దతుగా ముందుకు వచ్చారు. వివిధ రాజకీయ పార్టీలు, యూనివర్శిటీ పూర్వవిద్యార్థులు కూడా విద్యార్థులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలి, పోలీసు బలగాలను తొలగించాలని పదే పదే విజ్ఞప్తి చేశారు. జామియా విద్యార్థులు 'ఆజాద్ కశ్మీర్' అంటూ గోడలపై గ్రాఫిక్స్, నినాదాలు రాశారని, ఇవి జాతి వ్యతిరేక చర్యలు అని పెద్ద ఎత్తున కొన్ని శక్తులు ప్రచారం చేస్తున్నాయి. తమ నిరసనతో ఎలాంటి సంబంధాలు లేని బయటి వ్యక్తులు, పోలీసులు కలిసి ఉద్దేశపూర్వకంగా, విద్యార్థులపై నిందలు వేసేందుకు, చేసిన పని ఇది అని, ఆ పేరుతో విద్యార్థులపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేసే కుట్ర జరుగుతోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. క్యాంపస్ లోపల, బయట తమ ప్రతి కదలికలపై నిఘా పెడుతూ, అడ్డుకుంటున్న యూనివర్శిటీ సెక్యూరిటీకి, పోలీసులకు ఆ పని చేసిన వాళ్ళను తాము చూపించినా, వాళ్ళను పట్టుకోవడానికి వారికి ఎందుకు వీలు కావడం లేదని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. జామియా చరిత్రలో విద్యార్థి ఆందోళనలు కొత్తవి కావు. 1990 లలో సల్మాన్ రష్దీ వివాదం, 2006లో యూనియన్ రద్దు, 2019లో సిఏ, ఎన్ఆర్‌సి వ్యతిరేక ఉద్యమం వంటివి ముఖ్యమైనవి. 2019 డిసెంబర్ 15న పోలీసులు క్యాంపస్‌లోకి ప్రవేశించి లైబ్రరీ (జాకీర్ హుస్సేన్ సెంట్రల్ లైబ్రరీ), మసీదు, క్లాస్ రూంలోకి వెళ్లి టియర్ గ్యాస్ వేశారు. విద్యార్థులను లాఠీలతో కొట్టారు. నేరస్థుల వలే వారిని చేతులు పైకెత్తి నడిపించారు. విద్యార్థులపై పోలీసులు, సాదా దుస్తుల్లోఉన్న వ్యక్తులు కలసి దాడి చేసినప్పుడు వందలాది మంది విద్యార్థులు గాయపడ్డారు. మహిళా విద్యార్థులపై కూడా అమానుష చర్యలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఆ నాడు సుమారు వంద మంది గాయపడ్డారు. 50మందికి పైగా నిర్బంధం, కేసులు ఎదుర్కొన్నారు. కొందరిని ఆసుపత్రినుంచి కూడా పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. జామియా చరిత్రలో ఇది ఒక మాయని మచ్చగా నిలిచిపోయింది. ఆనాటి ఆందోళనలు సమసిపోయినా, అవే సమస్యలు, ఎస్ఐఆర్ రూపంలో మళ్ళీ, మళ్ళీ మన ముందుకు వచ్చాయి. అలాగే ఎన్నాళ్ళ నుండో పెండింగ్‌లో ఉన్న 24 వేలకు పైగా ఉన్న జామియా మిలియా ఇస్లామియా విద్యార్థుల సమస్యలు కూడా ఇంకా పరిష్కారాలకై వేచిచూస్తున్నాయి. జామియా లోనూ కొత్త జన్‌జీ తరం వచ్చింది.

టాస్క్ ఫోర్స్ -- షంషాబాద్ జోన్ -- ఆధార్ మరియు పాన్ కార్డులలో ఫోటోలు, పుట్టిన తేదీలను అక్రమంగా మార్చిన వ్యక్తి అరెస్టు



(షంషాబాద్ జోన్)
కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృం దం మరియు పహాడీషరీఫ్ పోలీసులు సంయు క్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో, ఆధార్ కార్డు లు మరియు పాన్ కార్డుల వంటి గుర్తింపు పత్రాలను అనధికారికంగా మార్చడం, ఫోర్జరీ చేయడం వంటి అక్రమాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు.

నిందితుడి వివరాలు:చ. మహాదేవ్, వయస్సు 36 ఏళ్లు, వృత్తి: వ్యాపారం (జెరాక్స్ షాపు), నివా సం: ఇంటి నం. 5-13/2, శ్రీరామ్ కాలనీ, జల్‌పల్లి, రంగారెడ్డి జిల్లా.స్వాధీనం చేసుకున్నవి: 1)నగదు రూ. 5,000/నకిలీ/మార్పులు చేసిన 60 ఆధార్ కార్డులు3) 02 పాన్ కార్డులు4) 01 ల్యాప్‌టాప్ 5)01 ప్రింటర్6)01లామినేష న్ మెషిన్ 7) 01 మొబైల్ ఫోన్ నేపథ్యం మరి యు నేర పద్ధతి నిందితుడు చ. మహాదేవ్ 7వ తరగతి వరకు చదువుకున్నాడు. ఇతను 'కవిత ఏటు జెడ్ ఆన్‌లైన్ సర్వీసెస్' పేరుతో బుద్వేల్, శ్రీరామ్ నగర్ కాలనీలో ఒక జెరాక్స్ కేంద్రాన్ని నడుపుతున్నాడు. కుటుంబ పోషణకు తన ఆదాయం సరిపోకపోవడంతో, సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం ఆధార్ కార్డులు, పాన్ కార్డులను ఫోర్జరీ చేయడం, వాటిలోని వివరాలను మార్చ డం వంటి అక్రమ మార్గాలను ఎంచుకున్నాడు. తన నివాసంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, ఆధార్ మరియు పాన్ కార్డులలో పేర్లు, ఫోటోలు, పుట్టిన తేదీలు, చిరునామాలు వంటి వివరాలను అక్రమంగా మార్చడం మొద లుపెట్టాడు. ఇలా తయారు చేసిన నకిలీ కార్డు లను వినియోగదారులు హైదరాబాద్ మరియు దాని పరిసర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఫ్యాక్టరీలలో ఉద్యోగాల కోసం, మొబైల్ సిమ్ కార్డులు పొం దడానికి, మరియు వివిధ ప్రభుత్వ పథకాలను పొందేందుకు ఉపయోగిస్తున్నారు. నిందితుడు అవసరమున్న వ్యక్తులకు డబ్బు తీసుకుని ఇటు వంటి నకిలీ ఆధార్ కార్డులను జారీ చేస్తు న్నాడు. పుట్టిన తేదీని మార్చడానికి రూ.300/ మరియు ఆధార్ కార్డులోని అన్ని వివరాలను మార్చడానికి రూ. 700/- నుండి రూ. 1,000 వరకు వసూలు చేస్తున్నారు.నమ్మదగిన సమా చారం మేరకు, హైదరాబాద్ నగరంలోని షం షాబాద్ జోన్, కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృందం నిందితుడు చ. మహాదేవ్‌ను అదుపులోకి తీసు కుని, అతని వద్ద ఉన్న పైన పేర్కొన్న వస్తువుల ను స్వాధీనం చేసుకుంది. అనంతరం, నిందితు డిని మరియు స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చర్యల నిమిత్తం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ అరెస్టు ప్రక్రియలో షంషాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీ డి. కృష్ణ మోహన్, ఎస్.ఐ.లు శ్రీ ఎస్. శేషు, కె. మన్సూర్ అలీ, ఎన్. నర్సింగ్ రావు, షంషాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది మరియు పహాడీ షరీఫ్ పోలీసులు పాల్గొన్నారు.
(కె.ఎస్.రావు) అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌టాస్క్ ఫోర్స్, షంషాబాద్ రాజేంద్ర నగ ర్ జోన్లు,హైదరాబాద్ నగరం

2,23,183 పెన్షన్లకు రూ. 96.93 కోట్ల లబ్ధి

- పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, అక్టోబర్ 30, 2026 : ఎన్‌టీఆర్ జిల్లాలో 2,23,183 పెన్షన్లకు మొత్తం రూ. 96.93 కోట్ల లబ్ధి జరుగుతోందని.. పెన్షన్ల పం పిణీ ప్రక్రియ సజావుగా జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.శుక్రవారం కం చికచర్ల మండలం, పరిటాల గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా.జి.ల క్ష్మీశ పరిశీలించారు. లబ్ధిదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ద్వారా పంపిణీ కార్యక్రమం సజావుగా జరుగుతుందా.. లేదా? అనేది పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సామాజిక భద్రత లక్ష్య ంగా అమలవుతున్న కార్యక్రమాన్ని సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. పింఛన్ల పంపి ణీలో ఎలాంటి అవకతవకలకు, నిర్లక్ష్యానికి తా వులేకుండా పారదర్శకంగా వ్యవహరించేందుకు సిబ్బందికి దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో అనుక్ష ణం పర్యవేక్షిస్తూ లోటుపాట్లు లేకుండా చూస్తు న్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.కార్యక్రమం లో నందిగామ ఆర్‌డీవో అనిల్ కుమార్, డీఆర్ డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట వ్యయ పర్యవేక్షణ వ్యవస్థ అత్యంత కీలకం..

- ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్



విజయవాడ, అక్టోబర్ 30, 2026 : జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ శుక్రవా రం ఇబ్రాహింపట్నం, విజయవాడ గ్రామీణ మం డలాల్లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక సం స్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల వ్యయ నిర్వహణ స్థితిగతులను, వ్యయ పర్యవేక్షణ బృ ందాల మోహరింపుపై సంబంధిత మండల పరి షత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), రిట ర్నింగ్ అధికారులతో సమీక్షించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలకు షిఫ్టుల వారీగా సజావుగా విధులు నిర్వర్తించేం దుకు అవసరమైన వాహనాలు, ఇతర వనరు లపైనా సమీక్షించారు. నిరంతర నిఘా కొనసా గించాలని సిబ్బందిని ఆదేశించారు. షాడో అ బ్జర్వేషన్ రిజిస్టర్లతో ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని.. అభ్యర్థులకు ఇచ్చిన ప్రచా ర అనుమతుల వివరాలను వ్యయ పర్యవేక్షణ, అకౌంటింగ్ బృందాలకు తప్పనిసరిగా అందజే యాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే నగదు, మ ద్యం, కానుకల పంపిణీని అడ్డుకునేందుకు తని ఖీలను ముమ్మరం చేయాలని.. అందిన ఫిర్యా దులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకం గా ఎన్నికలు నిర్వహించేందుకు వ్యయ పర్యవే క్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని.. ఇందుకు క్షే త్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచే యాలని విజయ్ కుమార్ సూచించారు.

నికర శూన్య కర్బన ఉద్గారాల సాధనకు సమగ్ర ప్రణాళికలు అవసరం


- నిర్మాణ రంగంలో పర్యావరణహిత విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- సుస్థిర పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ దిశగా సమష్టి కృషి అవసరం
- వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో సుస్థిర మౌలిక వసతులు కీలకం
- జాతీయ సదస్సులో ముఖ్యోపన్యాసం చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, అక్టోబర్ 30, 2026 : దేశంలో సుస్థి రమైన, తక్కువ కర్బన ఉద్గారాలు కలిగిన, వాతావరణ మార్పులను తట్టుకోగల పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నిర్మాణ రంగం, పట్టణ ప్రణాళిక, రియల్ ఎస్టేట్, సుస్థిర మౌలి క వసతుల మధ్య సమన్వయం ఎంతో అవస రమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన విద్యాసంస్థ విజ యవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ).. నీడ్ మిషన్ సహకారంతో శుక్రవా రం ఎస్‌పీఏలో "నిర్మిత పర్యావరణంలో నికర శూన్య కర్బన ఉద్గారాలు: భవనాల నుంచి నగ ర ప్రాంతాల వరకు - వికసిత్ భారత్ ఏ2047 లక్ష్యంగా నిర్మాణ శాస్త్రం, పట్టణ ప్రణాళిక, రియల్ ఎస్టేట్, సుస్థిర మౌలిక వసతుల సమ న్వయం" అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో ప్రముఖులు, వి ద్యావేత్తలు, ప్రభుత్వ అధికారులు, వృత్తి నిపుణు లు, పరిశోధకులు, పారిశ్రామిక ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని దేశంలో సుస్థిర అభివృద్ధి, తక్కువ కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పు లను తట్టుకోగల నిర్మాణ వ్యవస్థల అభివృద్ధిపై చర్చించారు. సదస్సులో కలెక్టర్ లక్ష్మీశ మాట్లా డుతూ సుస్థిర పట్టణాభివృద్ధి, సమన్వయ పాల న, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్ర మాల్లో పర్యావరణ పరిరక్షణ అంశాలను అంత ర్భాగం చేయడం ద్వారా వికసిత్ భారత్ ఏ204 7 లక్ష్య సాధనకు దోహదపడుతుందని వివరిం చారు.పటిష్ట సమన్వయంతో పర్యావారణ సవా ళ్లను ఎదుర్కొందాం:ఎస్‌పీఏ విజయవాడ ఆర్కి టెక్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమితవ సర్కార్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో నిర్మాణ రంగం, పట్ట ణ ప్రణాళిక, అనుబంధ రంగాల మధ్య సమన్వ యం, పరస్పర సహకారం అవసరమన్నారు. ఎస్‌పీఏ విజయవాడ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. రమేష్ శ్రీకొండ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, నిర్మిత పర్యావరణ రంగంలో వినూత్న విధానాలను ప్రోత్సహించేం దుకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. అన్నా విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లా నింగ్ మాజీ డీన్ డాక్టర్ మోన్సింగ్ దేవదాస్.. సుస్థిర, పర్యావరణహిత అభివృద్ధి, నిర్మాణ పద్ధ తుల ప్రోత్సాహంలో నిర్మాణ విద్య, పరిశోధ నలు, వృత్తిపరమైన అనుభవాల పాత్రను వివరి ంచారు. విభా సెక్రటరీ జనరల్ పి.ఏ.వివేకా నంద మాట్లాడుతూ దేశ దీర్ఘకాలిక అభివృద్ధి ల క్ష్యాల సాధనకు సమష్టి భాగస్వామ్యం, సంస్థల మధ్య సహకారం, విజ్ఞానాన్ని పరస్పరం పంచు కోవడం ఎంతో అవసరమన్నారు. స్టూడియో చి ంతల అధిపతి, ఆర్కిటెక్ట్ దివాకర్ చింతల తన పరిశోధన ప్రాజెక్టులైన ఈపాజిటివ్ ల్యాబ్స్, అ మరరాజా పరిశోధనా కేంద్రం, అమెరికాలో జె న్సర్ సంస్థ ద్వారా చేపట్టిన నియర్ జీరో కమ ర్షియల్ బిల్డింగ్ ప్రాజెక్టుల గురించి తన అభిప్రా యాలను పంచుకున్నారు.సదస్సులో ప్రధానం గా విద్య, ఆరోగ్యం, వాణిజ్య భవనాలు, నగర ప్రాంతాలు, వ్యూహాలు, భావనలు అనే అయిదు అంశాలపై చర్చలు జరిగాయి. వాతావరణ మా ర్పులను తట్టుకోగల నగర ప్రాంతాల అభివృద్ధి, భవనాల్లో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించ డం, పునరుత్పాదక ఇంధన వనరుల వినియో గం, సుస్థిర రవాణా వ్యవస్థలు, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువడే నిర్మాణ సామగ్రి వినియో గం వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రా యాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి అయ్యర్, డాక్టర్ అమితవ సర్కార్, డాక్టర్ జన్మజయ్ గుప్తా, డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, డాక్టర్ ఫైజ్, డాక్టర్ అ నురాగ్, డాక్టర్ రాజీవ్ తదితరులు తమ పరిశో ధన ప్రాజెక్టుల ఫలితాలను వివరించారు. విద్యా ర్థులు సైతం ఈ సదస్సుకు అనుబంధంగా తమ విద్యా సంబంధిత ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎస్‌పీఏ విజయవాడ డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎస్. వెంకట కృష్ణ కుమార్ ముగింపు కార్యక్ర మంలో పాల్గొని, సదస్సుకు హాజరైన అతిథుల కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పురపాలక ఎన్నికల ప్రచార గడువు నేటితో ముగిసింది నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు


- అన్ని రకాల బహిరంగ, డిజిటల్ ప్రచారాలకు స్వస్తి పలకాలి
- ఎన్నికలు జరిగే ప్రాంతాలకు సంబంధం లేని రాజకీయ నాయకులు, కార్యకర్తలు వెంటనే వెళ్లిపోవాలి
- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, బహుమతుల పంపిణీ చేస్తే చర్యలు తప్పవు
- నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి -- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ



విజయవాడ: అక్టోబర్ 30,2026 : ఎన్.టి.ఆర్ జిల్లా పరిధిలోని పురపాలక ఎన్నికల ప్రచార గడువు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రచార గడువు ముగిసిన వెంటనే అన్ని రకాల ప్రచార కార్యక్ర మాలను నిలిపివేయాలని స్పష్టం చేశారు. బహి రంగ ప్రచారాలు, మైకుల వినియోగంపై నిషే ధం ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహి ంచరాదు. మైకులు, లౌడ్‌స్పీకర్ల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలి. ఫేస్‌బుక్ లైవ్, జూమ్, గూగుల్ మీట్ తదితర ఆన్‌లైన్ వేదికలు, సోష ల్ మీడియా ద్వారా కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి వీల్లేదని తెలిపారు. ఎన్నికలు జరిగే డివిజన్లు, వార్డులకు చెందని రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రచారకులు తక్షణమే ఆయా ప్రాంతాలను విడిచి వెళ్లాలని ఆదేశిం చారు. ఇంటింటి ప్రచారాలు, అనుమతి లేని సమావేశాలు జరగకుండా నిఘా బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం లేదా ఇతర బహుమతులు పంపిణీ చేయడం ఎన్నికల నిబం ధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని ఫ్లయింగ్ స్క్వాడ్ బృం దాలు గుర్తించి, ఎన్నికల చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. పుర పాలక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వ హించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలో భాలకు, భయాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతం గా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేందు కు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరా రు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మద్యం విక్రయాలపై నిషేధం

- అక్టోబర్ 30 సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మద్యం దుకాణాలు మూసివేత
- రీపోలింగ్ జరిగితే నవంబర్ 2న, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు కూడా నిషేధం అమలు
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ



విజయవాడ: అక్టోబర్ 30, 2026 : ఎన్.టి.ఆర్. జిల్లాలో అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్య ంలో ఎన్నికలు జరిగే మున్సిపల్ ప్రాంతాలతో పాటు వాటి పరిధిలోని 5 కిలోమీటర్ల మేర మద్యం విక్రయాలపై నిషేధం విధించినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.ఎన్నికల పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకొని 2026 అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మద్యం విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, నవంబర్ 2వ తేదీన రీపోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడితే, ఆ రోజున కూడా మద్యం విక్రయాలపై నిషేధం కొనసాగు తుందని తెలిపారు. నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిషేధం లిక్కర్ షాపులు, బార్లు, మిలిటరీ క్యాంటీన్లు, లైసెన్సులు, కల్లు దుకాణాలు డిస్టిలరీలు, బ్రూవరీలకు వర్తిస్తుందని పేర్కొన్నా రు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణం లో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందు కు ఎన్నికల సంఘం నిబంధనలను సంబంధిత మద్యం దుకాణాలు, బార్లు మరియు ఇతర సం స్థల యజమానులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు.

'అర్నబ్' ఎఫెక్ట్.. ఏపీలో మరో ఏడు రోజులు కుండపోత వర్షాలు.



ఆంధ్రప్రదేశ్ అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. మరో ఏడు రోజులపాటు కూడా భారీ వర్షాలు కొనసాగు తాయని భారత వాతావరణ కేంద్రం హెచ్చరిం చింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నా యి. వాతావరణ కేంద్రం తాజా నివేదిక ప్రకార ం.. కోస్తాంధ్ర, యానాంలో భారీ నుంచి అతిభా రీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో కుండపో త వర్షాలు కురుస్తున్నాయి. మరో ఏడు రోజు లపాటు కూడా భారీ వర్షాలు కొనసాగుతాయని భారత వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతా వరణ కేంద్రం తాజా నివేదిక ప్రకారం.. కోస్తాం ధ్ర, యానాంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఈ ఏడు రోజుల్లో కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షపాతం నమోద య్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిం చారు. తీరం వెంబడి గంటకు 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకా శం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి తీర ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాల ని, ప్రత్యేకించి తీర ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఈ ఏడు రోజుల్లో కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షపాతం నమోద య్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు.భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ కేంద్రం తాజా నివేదిక ప్రకారం.. కోస్తాంధ్ర, యానాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు సీఎం చంద్రబాబు తుపాను పరిస్థితిని ఎప్పటి కప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు.

చేవెళ్లలో ఫామ్‌హౌస్ పార్టీపై పోలీసుల దాడి.. 25 మంది విద్యార్థులు అదుపులోకి!



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని ఓ ఫామ్ హౌస్‌లో నిర్వహిస్తున్న పార్టీని ఎస్ఓటీ పోలీసు లు భగ్నం చేశారు. ఈ ఘటనలో సుమారు 25 మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా చేవె ళ్ల మండలం కమ్మెట గ్రామ సమీపంలోని ఎజ్జీ ఫామ్‌హౌస్‌లో విద్యార్థులు పార్టీ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఓటీ పోలీసులు, స్థానిక చేవెళ్ల పోలీసులతో కలిసి అక్కడ మెరుపు దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన కొందరు విద్యార్థులు అక్క డి నుంచి పరుగులు తీసేందుకు ప్రయత్నిం చిన ట్లు సమాచారం.ఈ పార్టీలో ఐబీఎస్ యూని వర్సిటీకి చెందిన విద్యార్థులు ఉన్నట్లు పోలీసు లు గుర్తించారు. బీబీఏ, ఇంజినీరింగ్ విభాగాల కు చెందిన విద్యార్థులు పార్టీలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. సుమారు 20 నుంచి 25 మంది విద్యార్థినులు సహా మొత్తం 25 మంది వరకు ఉన్నట్లు సమాచారం. వారందరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు త రలించి విచారిస్తున్నారు. పోలీసుల రాకను గమ నించిన కొందరు విద్యార్థులు అక్కడి నుంచి పరుగులు తీసేందుకు ప్రయత్నిం చినట్లు సమా చారం.రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం కమ్మెట గ్రామ సమీపంలోని ఎజ్జీ ఫామ్‌హౌస్‌లో విద్యా ర్థులు పార్టీ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమా చారం అందింది. దీంతో ఎస్ఓటీ పోలీసులు, స్థానిక చేవెళ్ల పోలీసులతో కలిసి అక్కడ మెరుపు దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన కొందరు విద్యార్థులు అక్కడి నుంచి పరుగులు తీసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. పార్టీలో మద్యం సేవిం చినట్లు అనుమానంతో విద్యార్థులకు పోలీసులు డ్రగ్ టెస్టులు నిర్వహి స్తున్నట్లు తెలిసింది. ఫామ్ హౌస్‌లో భారీగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పా ర్టీ నిర్వహణకు సంబంధించిన వివరాలు, డ్రగ్స్ వినియోగం జరిగిందా లేదా అనే కోణంలో పో లీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీళ్లు కాలువలై పారుతున్నా..! తడవని మడి

కనికరం లేని కాంగ్రెస్ పాలనలో తెలంగణ మా గాణంలో సాగు భారమవుతున్నది. బతుకులు ఛి ద్రమవుతున్నవి. అన్నం పెట్టిన చేతులతోనే పం టలకు నిప్పు పెడుతున్నరు. కాడి వదిలేసి, చేళు బీళ్లు పెట్టి పొట్టకూటి కోసం అన్నదాతలు పట్ట ం బాట పడుతున్న దుస్థితి నేడు తెలంగాణలో నిత్యకృత్యమ వుతున్నది. నీళ్లు లేక, కరెంట్ రాక కండ్లముందే పంటలు ఎండిపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరవు తున్నారు. సర్కార్ సాయం చేయకున్నా అప్పులు చేసి పంటలు వేసిన రైతలు కన్నీటితో సాగును కొనసాగిస్తున్నారు. పాలకులు సాగుకు నీళ్లు, కరెంట్ ఇవ్వకున్నా కావడి మోసి, ట్యాంకర్లు తెచ్చి పంటల గొం తులు తడుపుతున్నా ఫలితం కానరావడం లేదు. చంటి బిడ్డలా కాపాడుకున్న పంటలు కండ్లము ందే ఎండిపోతుంటే విలవిల్లా డిపోతున్నారు. సా గును ఎలాగైనా బాగు చేసుకోవాలనే ఆరాటం తో అయినకాడికి అప్పు చేసి వందల ఫీట్ల లోతులో బోర్లు వేయిస్తున్నారు. అయినా చుక్క నీరు రాకపోవడంతో కన్నీళ్లపర్యంతమవుతున్నా రు. ఇందుకు బల్ల మైసమ్మ మహిళా రైతు సేద్య మే నిదర్శనం.మైసమ్మ మనోవేదన..వివరాల్లోకి వెళ్తే..వికారాబాద్ జిల్లా దోమ మండలం లిం గంపల్లి గ్రామానికి చెందిన బల్ల మైసమ్మ అనే మహిళా రైతు ఆరు ఎకరాల్లో నాటు వేసింది. కరెంటు లేకపోవడంతో వేసిన పంట ఎండిపో తున్న కారణంగా పంటను ఎలాగైనా కాపాడు కోవాలనే ఆరాటంతో బోరు వేసింది. అది కూ డా ఫోయిల్ అవడంతో 800 వందల ఫీట్ల మ రో బోర్ వేసినా ప్రయోజనం లేకపోవడంతో కన్నీరు పెట్టున్న దృశ్యం పలువురిని కలిచివేస్తు న్నది. మరోరైతు కొండని బాబయ్యది మరో వ్య థ.24 గంటల కరెంటు ఇస్తారని నమ్మకంతో త న సొంత పొలం ఎకరం కవులుగా మరో ఏడు ఎకరాలు తీసుకొని పంట సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో కరెంటు కోతల వల్ల వేసిన పంట పొలం ఎండు ముఖం పట్టింది. లోవాల్టేజిల కారణంగా వారం రోజులలో మూ డుసార్లు బోరు మోటర్ కాలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.కోరుకుంటున్నరు.



ఫిలిప్స్ విధ్వంసం.. అరుదైన ప్రపంచ రికార్డు సొంతం!

● భారత్‌పై పరుగుల వరద.. ఒకే ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన న్యూజిలాండ్ బ్యాటర్‌గా ఘనత

న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన రికార్డును సృష్టించాడు. భారత్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి రికార్డుల పుస్తకాల్లో తన పేరును లిఖించుకున్నాడు. ముఖ్యంగా నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత బౌలర్లపై విరుచుకుపడిన ఫిలిప్స్ భారీ సిక్సర్లు, బౌండరీలతో అభిమానులను అలరించాడు. కేవలం 46 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసి తన బ్యాటింగ్ సత్తాను చాటుకున్నాడు.నాలుగో టీ20లో ఫిలిప్స్ 49 బంతుల్లో 107 పరుగులు సాధించాడు. ఇందులో 10 సిక్సర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. అతడి దూకుడుతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ క్రమంలో భారత్‌పై టీ20ల్లో అత్యధిక స్కోరు నమోదు చేసిన జట్టుగా న్యూజిలాండ్ నిలిచింది.ఫిలిప్స్‌కు మరోవైపు మైఖేల్ బ్రేస్‌వెల్ అద్భుత సహకారం అందించాడు. బ్రేస్‌వెల్ కేవలం 25 బంతుల్లోనే 65 పరుగులు చేసి భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు కేవలం 41 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో న్యూజిలాండ్ భారీ స్కోరు సాధించగలిగింది.ఈ సెంచరీతో ఫిలిప్స్ భారత్‌పై ఒక ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. నాలుగు మ్యాచ్‌ల్లో 92 సగటుతో 276 పరుగులు సాధించాడు. గతంలో వెస్టిండీస్ ఆటగాడు షాయ్ హోప్ భారత్‌పై సాధించిన 261 పరుగుల రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో ఇంగ్లండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ 229 పరుగులతో మూడో స్థానంలో, వెస్టిండీస్ ఆటగాడు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 221 పరుగులతో నాలుగో స్థానంలో ఉన్నారు. అంతేకాకుండా ఫిలిప్స్ తన టీ20 అంతర్జాతీయ కెరీర్‌లో మూడో శతకాన్ని నమోదు చేశాడు. 46 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేయడం ద్వారా న్యూజిలాండ్ తరఫున అత్యంత వేగంగా టీ20 శతకాలు సాధించిన ఆటగాళ్ల జాబితాలోనూ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. భారత్‌పై ఫిలిప్స్ చూపిన ఈ విధ్వంసకర బ్యాటింగ్ ప్రదర్శన క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.

అండర్-19 ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన

● జట్టులో సెహ్వాగ్, ద్రవిడ్ తనయులు..

కెప్టెన్‌గా లక్ష్య రాయ్‌చందానీ



న్యూఢిల్లీ: అండర్-19 ఆసియా కప్ 2026 టోర్నమెంట్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టులో భారత క్రికెట్ దిగ్గజాలు వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ తనయులు ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్ చోటు దక్కించుకోవడం విశేషం. నవంబర్ 5 నుంచి 14 వరకు ఒమన్‌లోని మస్కట్ వేదికగా ఈ టోర్నీ జరగనుంది. భారత జట్టుకు లక్ష్య రాయ్‌చందానీ కెప్టెన్‌గా, యశ్‌వర్ధన్ సింగ్ చౌహాన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.**మెరుగైన ప్రదర్శనతో జట్టులో చోటు** ఇటీవల జరిగిన వినూ మంకడ్ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆర్యవీర్, అన్వయ్‌లకు సెలెక్టర్లు అవకాశం కల్పించారు. ఢిల్లీ తరఫున ఆడుతున్న 19 ఏళ్ల ఆర్యవీర్ సెహ్వాగ్ చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో 143 బంతుల్లో 173 పరుగులు సాధించి ఆకట్టుకున్నాడు. మరోవైపు కర్ణాటక తరఫున బరిలోకి దిగిన 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్ గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 100 బంతుల్లోనే 151 పరుగులు సాధించాడు. గతంలో శ్రీలంకతో జరిగిన యువ వన్డే మ్యాచ్‌లోనూ అన్వయ్ 67 బంతుల్లో 87 పరుగులు చేసి తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ ప్రదర్శనలే ఆసియా కప్ జట్టులో వారికి చోటు దక్కడానికి దోహదపడ్డాయి.**పాకిస్థాన్‌తో కీలక పోరు** ఈ టోర్నీలో భారత్ గ్రూప్-ఎలో చోటు దక్కించుకుంది. ఈ గ్రూపులో పాకిస్థాన్, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్లు ఉన్నాయి. గ్రూప్-బిలో బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్థాన్, మలేషియా జట్లు పోటీపడనున్నాయి. భారత్ నవంబర్ 6న నేపాల్‌తో తొలి మ్యాచ్ ఆడనుండగా, నవంబర్ 8న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. నవంబర్ 10న యూఏఈతో చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నవంబర్ 12న జరిగే సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. నవంబర్ 14న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.భారత అండర్-19 జట్టు: లక్ష్య రాయ్‌చందానీ (కెప్టెన్), ఆర్యవీర్ సెహ్వాగ్, వి.కె. వినీత్, యశ్‌వర్ధన్ సింగ్ చౌహాన్ (వైస్ కెప్టెన్), కుషాగ్ర ఓజా, అర్జున్ రాజ్‌పుత్, మణాల్ చౌహాన్, అన్వయ్ ద్రవిడ్, రజత్ బఘేల్, వి. యశ్వీర్, ఆర్యన్ సావసాని, మోహిత్ ఉల్వా, కావ్య పటేల్, షవిన్ వినోద్, ఇషాన్ సూద్.

టీ20 క్రికెట్‌లో రషీద్ ఖాన్ చరిత్ర..
200 వికెట్ల అరుదైన ఘనత!

పురుషుల అంతర్జాతీయ టీ20ల్లో ఈ మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా రికార్డు.. రెండో స్థానంలో ఇంగ్లండ్ బౌలర్ ఆదిల్ రషీద్

అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. జింబాబ్వేతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. జింబాబ్వే బ్యాటర్ తడివనాషే మరుమానిని తొమ్మిదో ఓవర్‌లో ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేయడం ద్వారా రషీద్ తన 200వ వికెట్‌ను పూర్తి చేసుకున్నాడు.రషీద్ ఖాన్ తన 120వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లోనే ఈ అరుదైన మైలురాయిని చేరుకోవడం విశేషం. 2015లో అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన ఆయన, తన అద్భుతమైన స్పిన్ బౌలింగ్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. తక్కువ పరుగులు ఇస్తూ కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టడంలో రషీద్‌కు మంచి పేరుంది. ఇప్పటివరకు రెండు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించగా, 3 పరుగులకు 5 వికెట్లు పడగొట్టడం అతడి అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. **ఆదిల్ రషీద్‌కు అందనంత దూరంలో..**అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రషీద్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ బౌలర్ ఆదిల్ రషీద్



171 వికెట్లతో రెండో స్థానంలో ఉండగా, హాంకాంగ్‌కు చెందిన ఎహ్సాన్ ఖాన్, న్యూజిలాండ్ బౌలర్ ఇష్ సోధీ చెరో 165 వికెట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో రషీద్ ఖాన్ రెండో స్థానంలో ఉన్న ఆదిల్ రషీద్ కంటే 29 వికెట్ల ఆధిక్యంలో నిలిచాడు. **బ్యాటింగ్‌లోనూ మెరిసిన రషీద్..** జింబాబ్వేతో జరిగిన ఈ మ్యాచ్‌లో రషీద్ బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ సత్తా చాటాడు. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ ఒక దశలో 38 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 50 బంతుల్లో 116 పరుగులతో అద్భుత శతకం సాధించగా, ఇజాజ్ అహ్మద్ అహ్మద్‌జాయ్ 27 బంతుల్లో 52 పరుగులు చేసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 142 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చివర్లో కెప్టెన్ రషీద్ ఖాన్ కేవలం ఆరు బంతుల్లోనే అజేయంగా 25 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు సిక్సర్లు ఉండటం విశేషం.దీంతో అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా అజేయ శతకంతో పోరాడినప్పటికీ, ఆ జట్టు 202 పరుగులకే పరిమితమైంది. దీంతో అఫ్గానిస్థాన్ 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే అఫ్గానిస్థాన్ కైవసం చేసుకుంది. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ రాణించిన రషీద్ ఖాన్ తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకుని క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు.

నాలుగో టీ20లో న్యూజిలాండ్ ఘన విజయం

- భారత్‌పై 87 పరుగుల తేడాతో గెలుపు.. సిరీస్‌లో తొలి విజయాన్ని అందుకున్న కివీస్



ఆక్లాండ్: భారత్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ అద్భుత విజయాన్ని అందుకుంది. గ్లెన్ ఫిలిప్స్ విధ్వంసకర శతకం, మైఖేల్ బ్రేస్‌వెల్ మెరుపు అర్ధశతకం, జాకబ్ డఫీ పదునైన బౌలింగ్‌తో కివీస్ జట్టు 87 పరుగుల భారీ తేడాతో భారత్‌ను ఓడించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో వరుసగా మూడు విజయాలు సాధించి ఆధిక్యంలో ఉన్న భారత్‌కు ఈ మ్యాచ్‌లో ఎదురుదెబ్బ తగిలింది. అయితే ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా 3-1 ఆధిక్యంలో కొనసాగుతోంది.**ఫిలిప్స్, బ్రేస్‌వెల్ విధ్వంసం.. భారీ స్కోరు** టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలుత న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఆరంభంలోనే టిమ్ సీఫెర్ట్ (3), డారిల్ మిచెల్ (24) వికెట్లు కోల్పోయిన కివీస్‌ను ఫిన్ అలెన్ (31) ఆదుకున్నాడు. అనంతరం గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లతో 107 పరుగులు సాధించి అద్భుత శతకాన్ని నమోదు చేశాడు. అతడికి మైఖేల్ బ్రేస్‌వెల్ అద్భుత సహకారం అందించాడు. కేవలం 25 బంతుల్లో 6 సిక్సర్లు, 4 ఫోర్లతో 65 పరుగులు చేసి భారత బౌలర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు కేవలం 41 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత్‌పై టీ20ల్లో ఒక జట్టు సాధించిన అత్యధిక స్కోరుగా ఇది నిలిచింది.**ఆరంభంలోనే కుప్పకూలిన భారత్** 260 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలోనే షాక్ తగిలింది. న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ తొలి ఓవర్‌లోనే సంజూ శాంసన్, ఇషాన్ కిషన్‌లను పెవిలియన్‌కు పంపి భారత్‌ను దెబ్బతీశాడు. అనంతరం వికెట్లు వరుసగా పడిపోవడంతో భారత జట్టు లక్ష్య ఛేదనలో వెనుకబడింది. అభిషేక్ శర్మ 27, శ్రేయస్ అయ్యర్ 22, నితీశ్ కుమార్ రెడ్డి 28, తిలక్ వర్మ 35 పరుగులు చేసినప్పటికీ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 172 పరుగులకే పరిమితమైంది.**డఫీ పదునైన బౌలింగ్.. కివీస్‌కు ఊరట** న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ అద్భుత బౌలింగ్‌తో భారత బ్యాటర్లను కట్టడి చేశాడు. నాలుగు ఓవర్లలో 23 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. మిచెల్ సాంట్నర్ కూడా కీలక వికెట్లు తీసి భారత పతనాన్ని వేగవంతం చేశాడు. దీంతో న్యూజిలాండ్ 87 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా మూడు ఓటముల తర్వాత కివీస్‌కు ఈ గెలుపు ఊరటనిచ్చింది. మరోవైపు భారత్‌కు న్యూజిలాండ్ గడ్డపై టీ20ల్లో ఉన్న అజేయ విజయాల పరంపరకు తెరపడింది. ఐదో, చివరి టీ20 మ్యాచ్ నవంబర్ 1న హామిల్టన్‌లో జరగనుంది.

టీమిండియాకు ఎదురుదెబ్బ.. వన్డే సిరీస్‌కు స్టార్ పేసర్ దూరం!

- న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు గాయం కారణంగా ప్రసిద్ధ్ కృష్ణ ఔట్.. ఫిట్‌నెస్ సాధించడంలో విఫలం



న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో త్వరలో ప్రారంభం కానున్న ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ గాయం కారణంగా ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న అతడు ఇంకా పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ నిర్ణయం తీసుకుంది. నవంబర్ 4 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో అతడి సేవలు అందుబాటులో ఉండవు.**వెస్టిండీస్ సిరీస్‌లో గాయం.. కోలుకోవడానికి మరింత సమయం** ఇటీవల వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా ప్రసిద్ధ్ కృష్ణ గాయపడ్డాడు. రెండో వన్డే సమయంలో తొడ కండరాలకు గాయం కావడంతో మైదానానికి దూరమయ్యాడు. అప్పటి నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాస చికిత్స పొందుతున్నాడు. వన్డే సిరీస్‌కు ఎంపికైనప్పటికీ అతడి భాగస్వామ్యం ఫిట్‌నెస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంపై ఆధారపడి ఉంది. అయితే మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరింత సమయం కావాలని వైద్య బృందం సూచించింది. దీంతో న్యూజిలాండ్ పర్యటనలో వన్డే సిరీస్‌కు అతడిని దూరంగా ఉంచారు.**సిరాజ్‌కు ఇండియా-ఎ జట్టులో చోటు**మరోవైపు సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను న్యూజిలాండ్-ఎతో జరిగే రెండో నాలుగు రోజుల మ్యాచ్ కోసం ఇండియా-ఎ జట్టులోకి చేర్చారు. అక్టోబర్ 31 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. టెస్టు సిరీస్‌కు ముందు మ్యాచ్ ప్రాక్టీస్ పొందేందుకు ఈ అవకాశం ఉపయోగపడనుంది. అలాగే ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తొలి వన్డే వరకు భారత జట్టుతోనే కొనసాగనున్నాడు. న్యూజిలాండ్-ఎతో జరిగే చివరి నాలుగు రోజుల మ్యాచ్ కోసం ఇండియా-ఎ జట్టులో చేరనున్నాడు.**నవంబర్ 4 నుంచి వన్డే సమరం**భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 4న ఆక్లాండ్‌లో ప్రారంభం కానుంది.

'ఛావా' డైరెక్టర్ నుంచి మరో బయోపిక్..

ఆకట్టుకుంటున్న 'ఈఠా' ట్రైలర్



బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'ఈఠా'. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి వితాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. 'ఛావా' వంటి బ్లాక్‌బస్టర్ చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

మహారాష్ట్ర జానపద సంస్కృతిలో భాగమైన లావణీ నృత్యంలో ఆరితేరిన వితాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఒక సాధారణ మహిళా కళాకారిణి తన ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను ఇందులో కళ్లకు కట్టినట్టు చూపించారు. ఇది శ్రద్ధా కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోయే పాత్ర అవుతుందని అంచనా వేస్తున్నారు.ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజాన్ నిర్మిస్తున్నారు. విలక్షణ నటుడు రణ్‌దీప్ హూడా కూడా ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

పాక్‌లోనూ 'రామాయణ' ఫీవర్..

రణ్‌బీర్ సినిమా కోసం కరాచీ హిందువుల పూజలు..



భారతీయ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన చిత్రం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్'. దర్శకుడు నితీశ్ తివారీ రూపొందించిన ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అంచనాలు పెరుగుతున్నాయి. కేవలం మన దేశంలోనే కాకుండా, సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లోనూ ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. తాజాగా పాకిస్థాన్‌లోని కరాచీలో నివసిస్తున్న హిందూ సమాజం ఈ సినిమా విజయం కోసం ప్రత్యేక వేడుకలు నిర్వహించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

స్థానిక యూట్యూబర్ షేర్ చేసిన ఒక వీడియోలో.. కరాచీలోని హిందువులు 'రామాయణ' సినిమా పోస్టర్‌ను పట్టుకుని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. డప్పులు, సంప్రదాయ సంగీతం, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం కరాచీలోని ప్రసిద్ధ లక్ష్మీనారాయణ ఆలయానికి చేరుకుని, అక్కడ సినిమా పోస్టర్‌ను ప్రదర్శించి, చిత్రం ఘన విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన పాత్రధారులైన రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడమే కాకుండా, ఆస్కార్ అవార్డును కూడా గెలుచుకోవాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకల ద్వారా తమ సంతోషాన్ని, సినిమా బృందానికి శుభాకాంక్షలను పంచుకుంటున్నామని వారు తెలిపారు. "పాకిస్థానీ హిందువులమైన మాకు, రామాయణ కేవలం ఒక సినిమా కాదు. దాని కథ, సాంస్కృతిక ప్రాముఖ్యత మా సంప్రదాయాలతో, తరతరాల వారసత్వంతో మమ్మల్ని కలుపుతుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విజయవంతం కావాలని కోరుకుంటున్నాం" అని ఆ వీడియోలో పేర్కొన్నారు.

మరోవైపు, ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రీమియర్ షో తర్వాత 'రామాయణ' సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. సినిమా చూసిన పలువురు లెటర్‌బాక్స్‌డ్‌లో తమ రివ్యూలను పంచుకున్నారు. నటీనటుల ప్రదర్శన, సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్, భావోద్వేగ సన్నివేశాలను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.

ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటన ఎంతో స్వచ్ఛంగా ఉందని, రావణుడిగా యశ్ నటన సినిమాకే హైలైట్‌గా నిలిచిందని కొనియాడారు. చాలా మంది ప్రేక్షకులు ఈ సినిమాకు ఫైవ్ స్టార్ రేటింగ్స్ ఇస్తూ, పౌరాణిక గాథను తెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.

నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్', దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటించారు.

చక్కనమ్మ చిక్కిందా?



బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు.

హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు



9వ నెలలోనూ సమంత వర్కౌట్లు..

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం తన ప్రెగ్నెన్సీలో చివరి దశను ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఆమె, గర్భంతో ఉన్నప్పటికీ తన ఫిట్‌నెస్ పట్ల ఏమాత్రం రాజీ పడటం లేదు. తాజాగా తొమ్మిదో నెలలోకి అడుగుపెట్టిన సందర్భంగా తన గర్భధారణ ప్రయాణంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఒక స్ఫూర్తిదాయక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'చ9. ది ఫైనల్ ల్యాప్' (చివరి అంకం) అనే క్యాప్షన్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.ఈ వీడియోలో సమంత తన గర్భం దాల్చిన మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు వివిధ దశల్లో చేసిన వర్కౌట్లను చూపించారు. ముఖ్యంగా, లేటెస్ట్ క్లిప్‌లో ఆమె ఛాతీకి దగ్గరగా డంబెల్ పట్టుకుని వెయిటెడ్ స్క్వాట్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం కారణంగా తన శరీరం మార్పులకు అనుగుణంగా వ్యాయామ దినచర్యను ఎలా మార్చుకున్నారో సమంత గతంలోనే వివరించారు.

"ఈ రోజుల్లో ట్రైనింగ్ కాస్త భిన్నంగా ఉంది. ఎక్కువగా శ్రమించడం కంటే, శరీరం చెప్పేది వినడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాను" అని ఆమె గతంలో ఒక వర్కౌట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె షేర్ చేసిన వీడియో కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

కాగా, సమంత తన భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. కొద్ది వారాల క్రితం, ఈ జంట కోయంబత్తూరులోని సద్గురు ఈశా ఫౌండేషన్‌లో తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను జరుపుకున్నారు. సమంత, రాజ్ 2025 డిసెంబర్‌లో ఇదే ఈశా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.సమంత పోస్ట్‌పై నటి కృతి కర్బందా స్పందిస్తూ.. "మీ ముగ్గురికీ నా ప్రేమ" అంటూ కామెంట్ చేశారు. సమంత ఫిట్‌నెస్ స్ఫూర్తిపై అభిమానులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గర్భంతో ఉన్నప్పటికీ చురుకుగా ఉంటూ ఎంతో మందికి ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు





గొప్ప సందేశాన్నిచ్చే సినిమా



యువన్‌కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్, మనస్విని భాగ్యరాజ సమర్పణలో కార్తీక్ భాగ్యరాజ రచన, దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డియర్ ఆస్ట్రోనాట్'. ఈ చిత్రంలో సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజు, గీతా భాస్కర్, చైత్ర ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని నవంబర్ 20న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ "ఆస్ట్రోనాట్ అవ్వాలనే కోరిక ఉండటం, ఆ కోరిక చుట్టూ కథను తీయడం బాగుంది. ఇది చాలా మంచి ప్రయోగం. ఎవరైనా సరే ఎంత పెద్ద కలలైనా కనొచ్చు, వాటిని సాకారం చేసుకోవచ్చు అనే గొప్ప సందేశాన్ని ఇచ్చేలా సినిమాని రూపొందించారు"అని అన్నారు. కమల్ కామరాజ్ మాట్లాడుతూ "కథకు ప్రాధాన్యమున్న చిత్రమిది. అందరికీ స్ఫూర్తినిచ్చే చిత్రమిది"అని తెలియజేశారు. సౌమిత్ మాట్లాడుతూ "డియర్ ఆస్ట్రోనాట్' చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రేక్షకులు అందరి పాత్రలతో ప్రయాణం చేస్తారు. మా సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రేయసి సేన్, శరణ్య ప్రదీప్, గీతా భాస్కర్, గద్దం వీరు, మార్తాండ్ కె వెంకటేష్, కార్తిక్, కృష్ణవేణి, మేఘన పాల్గొన్నారు.